## విలేఖరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా " శ్రీ ప్రస్థానం దినపత్రికలో " పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, సిటి ఇంచార్జులు, మండల స్థాయి పాత్రికేయులు కావలెను. సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని ప్రజల ముంగిటకు తీసుకెళ్లాలనే ఆసక్తి, అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుంది.

పెరుమాళ్ళ వర ప్రసాద్

సంప్రదించవలసిన నంబర్లు

94916 28386 85220 22029

Land Line No : 08517 224194



RNI Rgd NO : 2020/80757

www.sreeprasthanam.in

# శ్రీ ప్రస్థానం

మన దేశం..మన హక్కు

తెలుగు దినపత్రిక



తెలంగాణ - శ్రీ ప్రస్థానం

Call : 8522022029, 9491628386



కర్నూలు సంపుటి : 04 సంచిక : 27 శనివారం 11-05-2024 పేజీలు :04 వెల:రూ.2.00


# 'నకిలీ శివసేన వ్యక్తులు నన్ను సజీవ సమాధి చేస్తారట'.. ప్రధాని సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం మహారాష్ట్రలోని నందుర్‌బార్‌లో జరిగిన భారీ ర్యాలీలో ప్రధాని మోదీ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌తో పాటు శివసేన (యూబీటీ)ని కూడా తీవ్రంగా దుయ్యబట్టారు.నకిలీ శివసేన వ్యక్తులు నన్ను సజీవ సమాధి చేయాలని చూస్తున్నారని మోదీ ఆవేదన వ్యక్తం చేశారు. 'ఈ వ్యక్తులు మోదీ సమాధి తవ్వుతానంటున్నారు. మోదీని మట్టి కరిపిస్తామంటూ కలలు కంటున్నారు. వారి రాజకీయ దురుద్దేశ్యం ఎంతగా దిగజారిందో తెలుసుకోవాలన్న మోదీ, దేశంలోని తల్లులు, సోదరీమణులు రక్షణగా ఉన్నంతవరకు ఎవరు ఏం చేయలేరన్నారు.మోదీ మీ సమాధి తవ్వుతారని కాంగ్రెస్ ప్రజలు అంటున్నారని ప్రధాని అన్నారు. ఈ వ్యక్తులు ఓటు బ్యాంకు రాజకీయాల కోసం తమకు ఇష్టమైన పదాలను ఉపయోగిస్తున్నారు. నకిలీ శివసేన సభ్యులు బాంబు పేలుళ్ల దోషులను తమతో పాటు ప్రచారానికి తీసుకెళ్లడం ప్రారంభించారని ప్రధాని అన్నారు. దాణా కుంభకోణంలో దోషిగా తేలిన వ్యక్తిని భుజాలపై వేసుకుని బీహార్‌లో తిరుగుతున్నారు. బాలాసాహెబ్ ఠాక్రే ప్రతిష్టను దెబ్బతీయడానికి వీళ్లు ప్రయత్నిస్తున్నారని ప్రధాని అన్నారు.మహా అఘాడి (ఓం) రిజర్వేషన్‌ను నరమాంస భక్షకానికి పెద్దపీట వేస్తోందని ప్రధాని మోదీ ఆరోపించారు. అదే సమయంలో ఎస్సీ-ఎస్టీ-ఓబీసీల రిజర్వేషన్లను కాపాడేందుకు మోదీ మహారక్షణ మహాయజ్ఞం చేస్తున్నారన్నారు. నేను కాంగ్రెస్ రాజకుటుంబం లాంటి పెద్ద కుటుంబం నుంచి రాలేదన్న మోదీ, పేదరికంలో పెరిగాను. ఇక్కడ ఎన్ని కష్టాలు పడ్డానో నాకు తెలుసు. మీ జీవితంలో కూడా కష్టాల పర్వతాలు ఉన్నాయి. చాలా గిరిజన కుటుంబాలకు శాశ్వత ఇళ్లు లేవు. స్వాతంత్ర్యం వచ్చి 60 ఏళ్లు గడుస్తున్నా గ్రామాలకు కరెంటు రాలేదు. వాటన్నింటిని నేరవేర్చేందుకు అండగా ఉంటానని ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు.'ప్రతి పేద, ప్రతి గిరిజనుడికి ఇల్లు, ప్రతి గిరిజనుడి ఇంటికి నీరు, ప్రతి కుటుంబానికి నీటి సౌకర్యం, ప్రతి గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని మోదీ ప్రతిజ్ఞ చేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద నందుర్‌బార్‌లోని దాదాపు 1.25 లక్షల మంది పేదలకు శాశ్వత ఇళ్లు అందించామన్నారు. గత 10 ఏళ్లలో 4 కోట్ల పక్కా ఇళ్లు ఇచ్చామని, మూడో టర్మ్‌లో మరో 3 కోట్ల ఇళ్లు ఇస్తామన్నారు.కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం పథకాల ప్రయోజనాలను వివరించిన ప్రధాని మోదీ, 'ఎన్‌డిఏ ప్రభుత్వం మహారాష్ట్రలోని 20 వేలకు పైగా గ్రామాలలో ప్రతి ఇంటికి నీటిని అందించింది. ఇందులో నందుర్‌బార్‌లోని 111 గ్రామాలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం ఇది ట్రైలర్, ఇంకా చాలా చేయాల్సి ఉంది. అందుకే మరోసారి అవకాశం కల్పించాలని ప్రధాని మోదీ కోరారు.

# ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్‌లో పోలీసుల ఆంక్షలు

**నేటినుంచి 14 ఉదయం వరకు నిబంధనలు అమలు**

**పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో 144 సెక్షన్**




హైదరాబాద్,మే10: తెలంగాణలో ఈ నెల 13న లోక్‌సభ ఎన్నికల పోలింగ్ జరగనున్న నేపథ్యంలో హైదరాబాద్‌లో పోలీసులు ఆంక్షలు విధించారు. రోడ్లపై జనం ఎక్కువ మంది గుమిగూడటంపై ఆంక్షలు విధిస్తూ మూడు కమిషనరేట్లకు సంబంధించిన పోలీస్ కమిషనర్‌లు ఉత్తర్వులు జారీచేశారు. ఈ నెల 11న సాయంత్రం 6 గంటల నుంచి 14న ఉదయం 6 గంటల వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయని అధికారులు స్పష్టంచేశారు. పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని పోలీసులు ప్రకటించారు. పోలింగ్ కేంద్రం పరిధిలో ఐదుగురు అంతకుమి ంచి గుమిగూడవద్దని పోలీసులు స్పష్టం చేశారు. శనివారం సాయంత్రం నుంచి సోమవారం సాయంత్రం వరకు అన్ని రకాల ప్రచార కార్యక్రమాలపై నిషేధం అమల్లో ఉంటుందని తెలియజేశారు. ఏ లైసెన్సు కింద అనుమతి ఉన్నప్పటికీ మద్యం విక్రయాలపై ఆంక్షలు ఉంటాయని స్పష్టంచేశారు. 13వ తేదీన పోలింగ్ కేంద్రానికి వచ్చిన ఓటర్లు రెండు క్యూలైన్లలో నిలబడాలని.. మహిళలకు, పురుషులకు వేర్వేరుగా క్యూలైన్‌లు ఉంటాయని పోలీసులు తెలిపారు. రెండు కంటే ఎక్కువ లైన్లలో ఉండటాన్ని ఎట్టి పరిస్థితుల్లో అనుమతించబోమని చెప్పారు. ఈ ఆదేశాలను ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలు ఉంటాయని పోలీస్ కమిషనర్‌లు హెచ్చరించారు. ఆంక్షల సమయంలో మైకులు, స్పీకర్ల ద్వారా పాటలు పెట్టడం, ప్రజలను ఉద్దేశించి ప్రసంగాలు చేయడం నిషిద్ధమని అన్నారు. బహిరంగ ప్రదేశాల్లో షామియానాలు, పందిళ్లు వంటి తాత్కాలిక నిర్మాణాలు చేపట్టడానికి అనుమతి లేదన్నారు. వ్యక్తులు, వర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే ప్లకార్డులు, చిత్రాలు, గుర్తులు ప్రదర్శించడం నిషేధమని తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు కిలోమీటర్ దూరంలో కర్రలతో కూడిన జెండాలు, తుపాకులు, మారణాయుధాలతో సంచరించడం నిషేధమని పేర్కొన్నారు. ఆత్మరక్షణ పేరుతో కర్రలు, తుపాకులు, మారణాయుధాలు వినియోగించరాదని తెలిపారు.ద్యం దుకాణాలు, కల్లు దుకాణాలు, బార్లు, మద్యం విక్రయించే అన్ని సంస్థలను మూసేయాలని, రాష్ట్రంలో ఎన్నికల ప్రచారం ముగిసినప్పటి నుంచి పోలింగ్? పూర్తయ్యే వరకు మద్యం అమ్మకాలకు అనుమతి లేదని రాష్ట్ర ఎన్నికల ముఖ్య అధికారి (సీఈవో) వికాస్? రాజ్? ఆదేశాలు జారీచేశారు. అదేవిధంగా ఓట్ల లెక్కింపు రోజున మద్యం దుకాణాలు తెరవరాదని స్పష్టంచేశారు. ఈ నెల 11న సాయంత్రం 5 గంటల నుంచి 13న సాయంత్రం 6 వరకు మద్యం దుకాణాలు మూసివేయాలని సీఈవో ఉత్తర్వులు జారీ చేశారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు సందర్భంగా కూడా సాయంత్రం 5 గంటల వరకు మద్యం దుకాణాలను మూసేయాలని ఎన్నికల అధికారి ఆదేశించారు. ఒకవేళ ఎక్కడైనా రీపోలింగ్ ఉంటే అక్కడ సాయంత్రం 6 గంటల వరకు మద్యం దుకాణాలను మూసేయాలన్నారు. మద్యం డ్రై డేను కచ్చితంగా అమలు చేయాలని ఎక్సైజ్ శాఖకు సీఈవో స్పష్టం చేశారు.

# ఢిల్లీ సిఎం కేజ్రీవాల్‌కు ఊరట

**లిక్కర్ స్కామ్ కేసులో సుప్రీం బెయిల్**


**జూన్ 1వరకు బెయిల్ మంజూరు చేస్తూ ఆదేశాలు**

**జూన్ 2న తిరిగి లొంగిపోవాలని సూచన**

**ఇదే కేసులో కవితకు దక్కని బెయిల్ ఊరట**

**కేసును 24కు వాయిదా వేసిన ఢిల్లీ హైకోర్టు**

న్యూఢిల్లీ,మే10: లిక్కర్ స్కాం కేసులో అరెస్టై తీహార్ జైల్లో ఉన్న ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ కు సుప్రీమ్ కోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది జూన్ 1వరకు బెయిల్ మంజూరు చేస్తూ సుప్రీం కోర్టు తీర్పు వెల్లడించింది. దీంతో సార్వత్రిక ఎన్నికల వేళ కేజీవ్రాల్‌కు ఊరట లభించిందని చెప్పాలి. అయితే కవితకు మాత్రం బెయిల్ దక్కలేదు. ఈ క్రమంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు కూడా కేజ్రీవాల్‌కు అనుమతిస్తూ సుప్రీమ్ కోర్టు నిర్ణయం తీసుకుంది. గతంలో రౌస్ అవెన్యూ కోర్టు కేజీవ్రాల్ బెయిల్ పిటిషన్ ను కొట్టివేయగా కేజీవ్రాల్ సుప్రీమ్ కోర్టును ఆశ్రయించారు. పిటిషన్ పై విచారణ జరిపిన ధర్మాసనం శుక్రవారం బెయిల్ మంజూరు చేస్తూ తీర్పునిచ్చింది. అయితే, జూన్ 2న మళ్ళీ కోర్టులో సరెండర్ కావాలని ఆదేశించింది. కాగా, కేజీవ్రాల్ జూన్ 5వరకు బెయిల్ ఇవ్వాలని కోరారు. కేజీవ్రాల్ అరెస్ట్ అయిన 50రోజుల తర్వాత బెయిల్ మంజూరైంది. దీంతో ఆప్ పార్టీ శ్రేణుల్లో జోష్ నెలకొంది. సుప్రీమ్ నిర్ణయం పట్ల ఢిల్లీ మేయర్ హర్షం వ్యక్తం చేశారు. ఇకపోతే బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బెయిల్ పిటిషన్ పై ఢిల్లీ హైకోర్టులో విచారణ జరిగింది. విచారణ సందర్భంగా ఢిల్లీ హైకోర్టు ఈడీకి నోటీసులు జారీ చేసింది. దీనిపై మే 24న సమగ్ర విచారణ జరుపుతామని వాయిదా వేసింది. సిబిఐ కేసులో కవిత ఢిల్లీ హైకోర్టులో బెయిల్ పిటిషన్‌ను కూడా దాఖలు చేశారు. ఇది మే 13న విచారణకు వచ్చే అవకాశం ఉంది. జ్యూడిషియల్ కస్టడీలో ఉన్న కవిత బెయిల్ కోసం ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టును ఆశ్రయించారు. కోర్టు బెయిల్ పిటిషన్లను తిరస్కరించడంతో కవిత ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. కవిత దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ ను ఇవాళ ఢిల్లీ హైకోర్టు విచారించగా ఈడీకి నోటీసులు జారీ చేసింది. సమగ్ర విచారణ కోసంమే 24కు వాయిదా వేసింది. మార్చి 15 న అరెస్టయిన కవిత ప్రస్తుతం తీహార్ జైల్లో ఉన్నారు.



# ఆర్ఆర్ ట్యాక్స్ అంటే రేవంత్ రెడ్డి ఎందుకు స్పందిస్తున్నారు: మోడీ

మహబూబ్‌నగర్: బిఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం పేరిట లూటీ చేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ కూడా బిఆర్ఎస్ దారిలోనే లూటీ చేస్తోందని ప్రధాని నరేంద్ర మోడీ విమర్శించారు. కాళేశ్వరం విచారణకు కాంగ్రెస్ ముందుకు రావడం లేదని, కాంగ్రెస్ పార్టీ రాకుమారుడు ఎన్నికలు రాగానే విద్వేష విషం చిమ్ముతున్నారన్నారు. కాంగ్రెస్ రాకుమారుడి రాజగురువు మనల్ని రంగు ఆధారంగా విభజిస్తున్నారని, శరీర రంగును బట్టి మనం ఆఫ్రికన్లు అని మాట్లాడుతున్నారన్నారు. జోగులాంబ తల్లి పాదాలకు నమస్కరిస్తున్నానని, పాలమూరు సోదర, సోదరీమణులకు ప్రధాని నరేంద్ర మోడీ హృదయ పూర్వక నమస్కారాలు తెలిపారు. నారాయణ పేట జిల్లాలో జరిగిన బహిరంగ సభలో ప్రధాని మోడీ ప్రసంగించారు.మహబూబ్‌నగర్ ప్రాంతానికి కృష్ణా, తుంగభద్ర నదుల ఆశీర్వాదం ఉందని, ఈ ప్రాంతానికి సాగునీటి ప్రాజెక్టుల కోసం వేల కోట్లు ఇచ్చినప్పటికీ సద్వినియోగం కాలేదని, దీంతో పాలమూరు ప్రజలు వలస పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ కాంగ్రెస్ నేతలు పాలమూరు ప్రాంతాన్ని తమ స్వార్థానికి వాడుకున్నారని దుయ్యబట్టారు. మోడీ గ్యారంటీ అంటే అభివృద్ధి, దేశ భద్రత, విశ్వవేదికపై భారత గౌరవానికి గ్యారంటీ అని స్పష్టం చేశారు. పార్లమెంట్ ఎన్నికలు దేశ భవిష్యత్‌కు నిర్ధారించే ఎన్నికలు అని, గత పదేళ్లలో తెలంగాణకు రూ. లక్షల కోట్లు ఇచ్చామని, కేంద్రం ఇచ్చిన నిధులు అవినీతి ఎటిఎంలోకి వెళ్లాయని, గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం దోచుకుందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం దోచుకుంటుందని నరేంద్ర మోడీ ధ్వజమెత్తారు.ఆర్ఆర్ ట్యాక్స్ విషయంలో



తాను ఎవరి పేరు చెప్పలేదని, కానీ సిఎం రేవంత్ రెడ్డి స్పందించటం చూస్తే ఆర్ఆర్ ట్యాక్స్ ఎవరు వసూలు చేస్తున్నారో అర్థమవుతోందని చురకలంటించారు. సమాజంలో విషం నింపేందుకు కూటమి నేతలు ప్రయత్నిస్తున్నారన్నారు. కాంగ్రెస్‌కు హిందువులు, హిందువుల పండుగలు అంటే ఇష్టం లేదని, తాను గుడికి వెళ్తే కూడా దేశ వ్యతిరేకమైన పని అని విమర్శిస్తున్నారని, దేశంలో హిందువులను ద్వితీయ శ్రేణి పౌరులుగా చేయాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని నరేంద్ర మోడీ ధ్వజమెత్తారు. మతపరమైన రిజర్వేషన్లకు అంబేద్కర్ కూడా వ్యతిరేకమేనని, కులాల పేరిట, మతాల పేరిట దేశాన్ని విభజించాలని కాంగ్రెస్ చూస్తోందని దుయ్యబట్టారు.

# మోడీ అలా మాట్లాడటం సరికాదు: ఖర్గే

హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల మేరకు పథకాలు అమలు చేశామని ఏఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే తెలిపారు. ఏదైతే చెబుతామో అది కచ్చితంగా చేసి చూపిస్తామని, రైతు బంధు నిధులు, రైతుల ఖాతాల్లో జమ చేశామని, పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లిస్తామన్నారు. ఏఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే మీడియాతో మాట్లాడారు. ఎక్కువ విడతల్లో ఎన్నికల నిర్వహణ ఎవరికీ ఉపయోగం లేదని, ఎన్నికల కమిషన్ విధానాల మేరకు అందరూ నడుచుకోవాలని పేర్కొన్నారు. చేసిన అభివృద్ధి గురించి చెప్పుకొని



బిజెపి ఓట్లు అడగదని, కాంగ్రెస్‌పై నిందలు మోపడం ద్వారా ఓట్లు అడుగుతారని మండిపడ్డారు. కాంగ్రెస్ తమకు పోటీయే కదంటూనే పదేపదే విమర్శలు చేస్తోందని, కాంగ్రెస్‌కు భయపడుతున్నందునే పదే పదే ఆరోపణలు చేస్తున్నారని ఖర్గే చురకలంటించారు.నల్లధనం వెలికితీస్తామని ఎన్నో ప్రగల్భాలు పలికారని, నల్లధనం ప్రయోజనాలను తమ మిత్రులకే అందజేశారని దుయ్యబట్టారు. లోక్ సభ ఎన్నికల ప్రకటనల తరువాత అదానీ, అంబానీ గురించి మాట్లాడటం లేదన్నారు. టెంపోల్లో కాంగ్రెస్ నేతలకు డబ్బులు ముడుతున్నాయని ఆరోపించడం సరికాదని సూచించారు. ఎక్కడి నుంచి డబ్బులు ఎక్కడికి వెళ్తున్నాయో బిజెపి వారు చూశారా? అని ప్రశ్నించారు. టెంపోల్లో డబ్బు తరలిస్తుంటే ఐటి, కేంద్ర సంస్థలు ఏం చేస్తున్నాయని ప్రశ్నించారు. అదానీ,అంబానీ నుంచి డబ్బులు వాళ్ల ఇళ్లలో ఐటి, ఇడిలు సోదాలు చేయాలన్నారు.ఇలాంటి చిల్లర మాటలు మాట్లాడటం ప్రధాని మోడీకి స్థాయికి తగదని ఎద్దేవా చేశారు. ధనవంతుల ఆస్తులు లాక్కొని పంచుతామనడం సిగ్గుచేటు అని, దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ ఉందని గుర్తించాలని, ఇందిరాగాంధీ హయాంలో భూ సంస్కరణలు తీసుకొచ్చామని, అభివృద్ధిని గాలికొదిలేసి విపక్షంపై ఆరోపణలే బిజెపి వాళ్లు లక్ష్యంగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు.

# బీజేపీ పాలనలో నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగాయి : మంత్రి ఉత్తమ్

హైదరాబాద్ : గతంలో ఏ ప్రధాని కూడా మోదీలా దిగిజారి మాట్లాడలేదు. ఆర్థిక విధానల్లో బీజేపీ పూర్తిగా విఫలమైందని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఫైర్ అయ్యారు. బీజేపీ పాలనలో




దేశంలో నిత్యావసర ధరలు విపరీతంగా పెరగడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 70 ఏండ్లలో ఎన్నడూ లేనంతగా నిరుద్యోగం 40 శాతానికి పెరిగిందన్నారు .రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పిన బీజేపీ రైతుల ప్రయోజనాలకు విరుద్దంగా నల్ల చట్టాలు తీసుకొచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు ఉద్యమిస్తే తప్పా వాటిని రద్దు చేయలేదన్నారు. కేంద్రంలో 30 లక్షల ఉద్యోగాలు ఉంటే భర్తీ చేయడలం లేదని ఆరోపించారు. అగ్నివీర్ పథకం దేశ సంరక్షణకు ప్రమాదకరమన్నారు. వచ్చే ఎన్నికల్లోబీజేపీకి ఓటుతో బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

# కల్యాణ లక్ష్మి చెక్కు బౌన్స్ అయింది.. తులం బంగారం తుస్సుమన్నది: హరీశ్ రావు

హుస్నాబాద్: కాంగ్రెస్ నేతలు అన్నివర్గాల ప్రజలను మోసం చేశారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామన్నారని, 5 నెలలవుతున్నా దిక్కులేదని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం రివర్స్ గేర్‌లో నడుస్తున్నదని ఎద్దేవా చేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహి ంచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో విద్యుత్ నిరంతరం ఉండేదని, ఇప్పుడు నిత్యం సరఫరా నిలిచిపోతున్నదన్నారు. రైతులు, నిరుద్యోగులను ఈ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు.కల్యాణ లక్ష్మి చెక్కు బౌన్స్ అయింది.. తులం బంగారం తుస్సుమన్నదని చెప్పారు. పెండ్లి చేసుకున్న వాళ్లకు తులం బంగారం ఇస్తామన్న హామీ అమలు కాలేదన్నారు. పైగా కాంగ్రెస్ వచ్చాక బంగారం ధరలు కొండెక్కాయని, కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ నిలిచిపోయిందని చెప్పారు. కేసీఆర్ ఇవ్వడం లేదని విమర్శించారు. ప్రియాంక గాంధీ గతంలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి హుస్నాబాద్‌కు వచ్చినప్పుడు తాము గెలిస్తే ఇక్కడ మెడికల్ కాలేజీ ఇస్తామని చెప్పారని గుర్తించారు. ఆ హామీ ఏమైందని ప్రశ్నిం చారు. మహిళల ఖాతాల్లో రూ.2500 జమ చేశామని రాహుల్ గాంధీ చెప్పారని, ఆయ న అబద్ధాల గాంధీగా మారారని చెప్పారు.

శ్రీ ప్రస్థానం


సంపాదకీయం

# అధికార పార్టీ జేబుసంస్థగా ఎన్నికల కమిషన్ !

రాజకీయ పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు ఒకలా..లేనప్పుడు మరోలా మాట్లాడుతూ ఎన్నికల కమిషన్‌ను జేబు సంస్థగా మార్చుకుంటున్న తీరుతో ప్రజాస్వామ్యం అపహాస్యం అవుతోంది. ప్రస్తుతం మనదేశంలో ఎన్నికల వ్యవస్థ మేడిపండు చందంలా తయారయ్యింది. ఎన్నికల నిర్వహణ అన్నది ఓ ఫార్సులా తయారయ్యింది. డబ్బులు విచ్చలవిడిగా వెదజల్లుతూ ఎన్నికల్లో గెలవ గలుగుతున్నారు. సామాన్యులు, మేధావులు, సమాజంలో పేరు ప్రతిష్టలు ఉన్న వారు ప్రజా ప్రతినిధులుగా గెలవడం సాధ్యం కావడంలేదు. రౌడీలు,గూండాలు,హంతకులు డబ్బులు వెదజల్లుతూ.. ఓట్లను కొనుగోలు చేస్తూ గెలుస్తున్నారు. దీంతో నిరంకుశ ప్రభుత్వం ఏర్పడి..ఈసంస్థ స్వేచ్ఛను,సమగ్రతను దెబ్బతీస్తున్నా యి. ఎన్నికల కమిషన్ అనేది మన ప్రజాస్వామ్యానికి మూలస్తంభం లాంటి. అది పకడ్బందీగా ఎన్నికలను నిర్వహిస్తూ ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మగా ఉండాలి. అది నిర్వీర్యం అయితే అధికారంలో ఉన్న పార్టీలు స్వారీ చేస్తాయి. ఎన్నికల సంఘం ఎంత నిజాయితీగా, నిర్భీతిగా, నిరంకుశంగా పనిచేస్తే మన వ్యవస్థ అంత పటిష్ఠంగా ఉండగలుగు తుంది. ఎన్నికల కమిషన్‌లో సంస్కరణలు తీసుకు రావాల్సిన సమయం ఆసన్నమైందని రెండేళ్ల క్రితమే సుప్రీం ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు మనం గమనించవచ్చు. ముందుగా, ఎన్నికల కమిషనర్ల ఎంపిక ఒక కమిటీ ద్వారా జరగాలి. ఆ కమిటీలో భారత ప్రధాన న్యాయమూర్తి, లోక్‌సభలో ప్రతిపక్ష నేత సభ్యులుగా వుండాలి. ఇప్పుడు కమిషనర్ల ఎంపిక పూర్తిగా ప్రభుత్వం చేతుల్లోనే వుంటోంది. ఇక రెండోది, పదవీ విరమణ చేసిన తర్వాత, కమిషనర్ ఎలాంటి అధికారిక పదవిని చేపట్టరాదన్న నిబంధన కూడా ఉండాలి. గతంలో శేషన్ ఒక్కడే ఒంటిచేత్తో ఎన్నికల సంఘాన్ని నడిపారు. ఎన్నికల వ్యవస్థలో మార్పులకు శ్రీకారం చుట్టారు. ఉన్న చట్టాలతోనే ఆయన నిజాయితీతో ముందుకు సాగారు. దీంతో ఎన్నికల నిర్వహణ పకడ్బందీగా సాగింది. ఆయన తరవాత అలాంటి ప్రయత్నాలు ఎక్కడా జరగడం లేదు. అంతెందుకు ఇప్పటికీ పటిష్టమైన ఓటరు కార్డు విధానం లేదు. పాన్ కార్డు, ఆధార్ కార్డు పటిష్టంగా ఉ న్నప్పుడు ఓటరు కార్డు ఎందుకు ఉండకూడదన్న ఆలోచన ఇసి చేయడం లేదు. ఇటీవల కాలంలో భారత ఎన్నికల కమిషన్ తీసుకున్న కొన్ని చర్యలు, అనుసరించిన వైఖరులు...వివాదాస్పదం అయ్యాయి. స్వేచ్ఛగా,సక్రమంగా ఎన్నికలు నిర్వహించే పర్యవేక్షణ కొరవడింది. నిష్పక్షపాతంగా వ్యవహరించడం లేదు. గత కొన్నేళ్ళుగా, ముఖ్యంగా మోడీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత, ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణం గానే ఎన్నికల సంఘం వ్యవహరించడం కనిపిస్తోందన్న విమర్శలు బలపడ్డాయి. ఈ క్రమంలో సుప్రీంకోర్టు తాజాగా చేసిన వ్యాఖ్యలను అనుసరించి ఎన్నికల సంఘాన్ని మరింత బలోపేతం చేయాలి. స్వతంత్రంగా నడిచే సంస్థలా చేయాలి. ఎవరు కూడా వేలు పెట్టరాకుండా చేయాలి. తప్పుచేస్తే ప్రధాన మంత్రిపై సైతం చర్యలు తీసుకునేంత సత్తా ఉన్న ప్రధాన ఎన్నికల కమిషనర్ దేశానికి అవసరమని సుప్రీంకోర్టు అభిప్రాయ పడింది. రాజకీయాలతో సంబంధం లేని వ్యక్తుల ఎంపిక అవసరమని కూడా పేర్కొంది. కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ల నియామకానికి ప్రస్తుతం నడుస్తున్న వ్యవస్థ సరికాదని, కొలీజియం లాంటి వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై జస్టిస్ కెఎం జోసెఫ్, జస్టిస్ అజరు రస్తోగి, జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ హృషికేశ్ రారు, జస్టిస్ సిటి రవికుమార్‌లతో కూడిన సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం విచారించింది. ఎన్నికల సంఘం విధుల పైనా ధర్మాసనం లోతుగానే చర్చించింది. ప్రధానికి వ్యతిరేకంగా ఆరోపణలు వచ్చాయనుకుందాం. సిఇసి చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. సిఇసి బలహీనంగా ఉంటే ఎలాంటి చర్యలు తీసుకోలేరు కదా అని ధర్మాసనం పేర్కొంది. సిఇసి ఉన్నత స్థానం రాజకీయ ప్రభావానికి లోనుకాకుండా ఉండాలని కూడా అభిప్రాయపడింది. అంటే స్వతంత్రంగా ఉండాలి. కానీ అలా జరగడం లేదు. సుప్రీం సిజెఐ సభ్యుడిగా ఉండాలన్న సూచనను కేంద్రం పక్కన పెట్టింది. అందువల్ల ఇది పూర్తిగా వ్యవస్థ విచ్ఛిన్నం కిందకే వస్తుందని కూడా గమనించ వచ్చు. ఇప్పుడున్న పరిస్థితుల్లో కేంద్రంలో ఏ రాజకీయ పార్టీ అధికారంలో ఉ న్నా.. ఆ అధికారాన్ని శాశ్వతంగా నిలబెట్టు కోవాలనుకుంటోంది. పార్టీలతో సంబంధం లేకుండా ప్రతి ప్రభుత్వం కూడా అన్ని విషయాల్లో తమకు 'యస్' అంటూ తలూపే వ్యక్తినే సిఇసిగా నియమిస్తోంది. అందువల్ల అది స్వతంత్ర సంస్థ ఎలా అవుతుందని గుర్తించాలి. కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి నియామకం కోసం సమ్మిళిత పక్రియ అవసరం. ఈ నియామకం కోసం ఏర్పాటు చేసే కమిటీలో సిజెఐను కూడా సభ్యుడిగా చేర్చాలని సుప్రీం ధర్మాసనం అభిప్రాయపడినా మోడీ ప్రబుత్వం తిరస్కరించింది. తాజాగా జరుగుతున్న ఎన్నికల్లో అనేకచోట్ల నుంచి పుంఖానుపుంఖాలుగా ఫిర్యాదులు వస్తున్నాయి. అయినా చర్యలు మాత్రం కొంతమేరకే తీసుకుంటున్నారు. అందుకే ఎన్నికల కమిషన్‌లో సంస్కరణలు తీసుకు రావాల్సిన సమయం ఆసన్నమైంది. ముందుగా, ఎన్నికల కమిషనర్ల ఎంపిక ఒక కమిటీ ద్వారా జరగాలి. ఆ కమిటీలో భారత ప్రధాన న్యాయ మూర్తి, లోక్‌సభలో ప్రతిపక్ష నేత సభ్యులుగా వుండాలి. ఇప్పుడు ఇ.సి కమిషనర్ల ఎంపిక పూర్తిగా ప్రభుత్వం చేతుల్లోనే వుంటోంది. ఇక రెండోది, పదవీ విరమణ చేసిన తర్వాత, కమిషనర్ ఎలాంటి అధికారిక పదవిని చేపట్టరాదు. పార్లమెంటుకు లేదా అసెంబ్లీకి సభ్యులుగా వీరిని రాజకీయ పార్టీలు నామినేట్ చేయరాదు. ఇలా కఠిన నిబంధనలతో జవాబుదారీగా ఉండే విధంగా కమిషనర్లను ఎంపిక చేయాల్సి ఉంది. అవినీతిమయంగా ఎన్నికల ప్రక్రియ సాగుతున్న వేళ సంస్కర ణలు అవసరమే.

# పాకిస్థాన్‌ను గౌరవించండి.. ఆ దేశం వద్ద అణుబాంబు ఉన్నది: మణిశంకర్ అయ్యర్

న్యూఢిల్లీ: సీనియర్ కాంగ్రెస్ నేత మణి శంకర్ అయ్యర్‌పై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాకిస్థాన్‌తో చర్చలు నిర్వహించాలని, లేదంటే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఆయన ఇటీవల పేర్కొన్నారు. పాకిస్థాన్ వద్ద అణు బాంబులు ఉన్నాయని, ఒకవేళ మన ప్రభుత్వాలు ఆ దేశాన్ని సతాయిస్తే, అప్పుడు ఆ దేశం మనపై బాంబులు వేసే అవకాశాలు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇటీవల ఓ మీడియాకు ఇచ్చిన మణిశంకర్ అయ్యర్ ఇంటర్వ్యూ వైరల్ అయ్యింది. పాకిస్థాన్‌ను మనం గౌరవించాలని, ఎందుకంటే ఆ దేశం వద్ద బాంబు ఉందని, వాళ్లకు మన మర్యాద ఇవ్వకుంటే, వాళ్లు మనపై అణుబాంబును వాడే అవకాశం



ఉన్నట్లు అయ్యర్ వెల్లడించారు.పాకిస్థాన్‌తో చర్చలు జరపాలని, కానీ మనవాళ్లు మిలిటరీని వాడుతున్నారని, దీని వల్ల ఉద్రిక్తతలు పెరుగుతున్నాయని, వాళ్ల దగ్గర బాంబులు ఉ న్నాయని, ఓ పిచ్చోడు బాంబులు వేయాలనుకుంటే ఏమవుతుందో తెలుసా అని ఆయన అన్నారు. బాంబు మన దగ్గరా ఉన్నాయని, ఒకవేళ లాహోర్‌పై బాంబు పడితే, దాని రేడియేషన్ 8 సెకన్లలో అమృత్‌సర్ చేరుతుందన్నారు.మణిశంకర్ అయ్యర్ వ్యాఖ్యలను బీజేపీ తప్పుపట్టింది. ఇది కాంగ్రెస్ ఐడియాలజీని ప్రతిబింబిస్తుందని బీజేపీ ఆరోపించింది. అయ్యర్ వీడియోను కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ తన ఎక్స్ అకౌంట్‌లో షేర్ చేశారు. పాకిస్థాన్‌కు సపోర్టు పెరుగుతోందని, ఇది రాహుల్ గాంధీ కాంగ్రెస్ ఐడియాలజీ అని ఆయన విమర్శించారు. సియాచిన్‌ను వదిలేసుకునేందుకు ఆ పార్టీ సిద్దమైందన్నారు. ప్రజల్ని విభజించి, అబద్దాలు చెప్పి, ఫేక్ గ్యారెంటీలు ఇస్తున్నారని, పేదలను తప్పుదారి పట్టిస్తున్నారని మంత్రి ఆరోపించారు.పాకిస్థాన్ ఉగ్రవాదుల్ని తరిమికొడుతామని ఇటీవల ప్రధాని మోదీతో పాటు ఇతర నేతలు అనడంతో మణిశంకర్ అయ్యర్ ఆ వ్యాఖ్యలు చేసినట్లు స్పష్టమవుతోంది.

# శభాష్ అంకిత.. 'పది' ఫలితాల్లో 625కి 625 మార్కులతో స్టేట్ 1బబి ర్యాంక్ సాధించిన బాలిక

బెంగళూరు, మే 10: తెలుగు రాష్ట్రాల్లో ఇటీవల పదో తరగతి పరీక్షల ఫలితాలు వెలువడిన సంగతి తెలిసిందే. ఈసారి రెండు రాష్ట్రాల్లో భారీ ఉత్తీర్ణత నమోదైంది.ఏపీ పదో తరగతి ఫలితాల్లో ఏలూరు జిల్లాకు చెందిన నాగసాయి మనస్వీ 599/600 మార్కులతో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించి అందరినీ ఆశ్చర్యపరిచింది. తాజాగా కర్ణాటకలోనూ పదో తరగతి ఫలితాలు విడుదలవగా.. అందులో ఓ అమ్మాయి ఏకంగా 625/625 మార్కులు సాధించి అదరహో అనిపించింది. బాగల్‌కోట్ జిల్లాకు చెందిన అంకిత బసప్ప అనే విద్యార్థిని 625 మార్కులకు గానూ 625 మార్కులు సాధించింది. దీంతో రాష్ట్రంలో అత్యధిక స్కోర్ సాధించిన ఏకైక విద్యార్థిగా గుర్తింపు దక్కించుకుంది.కర్నాటక పది ఫలితాల్లో ఫస్ట్ ర్యాంకు కొట్టిన అంకిత బసప్ప కుటుంబ నేపథ్యం విషయాని కొస్తే.. తండ్రి బసప్ప రైతు



కాగా, తల్లి గృహిణి. ముధోల్ తాలుకాలో ఉన్న మొరార్జీ దేశాయ్ రెసిడెన్షియల్ పాఠశాలలో అంకిత చదువుతుంది. ఇంజినీరింగ్ పూర్తి, ఐఏఎస్ కావడమే తన లక్ష్యమని మీడియాకు వెల్లడించింది. అంకిత విజయం రాష్ట్రం అంతటా మారుమ్రోగడంతో స్వగ్రామం వజ్జరమట్టిలోని స్థానికులంతా ఆమె ఇంటికి చేరుకొని బాలికను అభినందించారు. ఈ సందర్భంగా అంకిత మాట్లాడుతూ.. 'తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల వల్లే ఈ విజయం సాధించగలిగాను. ఉపాధ్యాయులు ఎంతగానో ప్రోత్సహించి సహకరించారు. ఈ విజయం వల్ల నా కన్నా వాళ్లే ఎక్కువ ఆనందంగా ఉన్నారు. ప్రీ-యూనివర్సిటీలో సైన్స్ అభ్యసించాలని, ఇంజినీరింగ్ కోర్సు పూర్తి చేశాక.. ఆపై ఐఏఎస్ అధికారిగా దేశానికి సేవ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాను' అంటూ తెలిపింది.టెన్త్ ఫలితాల్లో ఫస్ట్ ర్యాంక్ సాధించిన అంకితను కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, బాలాకోట్ డిప్యూటీ కమిషనర్ కేఎం జానకి, జిల్లా పంచాయత్ సీఈవో శశిధర్ అభినందనలు తెలిపారు. ఈ ఏడాది ఫలితాల్లో దక్షిణ కన్నడకు చెందిన చిన్మయి 624, సహానా 624 మార్కులు సాధించారు. కర్ణాటకలో పదో తరగతి పరీక్షలు మార్చిలో జరిగాయి. దాదాపు 8.6 లక్షల మందికి పైగా విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవగా.. 6.31 లక్షల మంది ఉత్తీర్ణత సాధించారు.

# తెరుచుకున్న జ్యోతిర్లింగ క్షేత్రం కేదారనాథ్



**మిన్నంటిన హరహర మహదేవ్ నినాదాలు**

**తొలిదర్శనం చేసుకున్న సిఎం పుష్కర్ సింగ్ ధామి**



కేదార్‌నాథ్,మే10(: పరమశివుడి ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటైన ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్ ఆలయం తెరుచుకుంది. శుక్రవారం అక్షయ తృతీయ శుభ సందర్భంగా.. భజనలు, 'హర్ హర్ మహాదేవ్' కీర్తనల మధ్య ఆలయ తలుపులను అధికారులు తెరిచారు. ఈ సందర్భంగా చాపర్లతో పూల వర్షం కురిపించారు. పవిత్ర పుణ్యక్షేత్రమైన కేదార్ నాథ్ అలయాన్ని సందర్శించుకునేందుకు దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి కూడా ఆలయాన్ని సందర్శించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య ఉదయం 7 గంటలకు ఆలయ ప్రధాన తలుపులు అధికారులు తెరిచారు. ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి కుటుంబంతో కలిసి తొలి పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేదారేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.పరమేశ్వరుడి పవిత్ర ఆలయాలైన 12 జ్యోతిర్లింగాల్లో కేదార్‌నాథ్ ఆలయం ఒకటి. చార్‌ధామ్ యాత్రలో కేదార్ నాథ్ దేవాలయం సందర్శన భాగంగా ఉంటుంది. ఏటా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి లక్షల మంది భక్తులు కేదార్‌నాథ్‌కు చేరుకుని పరమేశ్వరుడ్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తుంటారు. అయితే, శీతాకాలం సందర్భంగా ఈ ఆలయాన్ని మూసివేస్తారు. ఇక దాదాపు ఆరు నెలల పాటు మూసి ఉన్న ఈ ఆలయ తలుపులు భక్తుల దర్శనార్థం నేడు తెరిచారు. ఈ సందర్భంగా ఆలయాన్ని అధికారులు సర్వాంగ సుందరంగా అలంకరించారు. సుమారు 40 క్వింటాళ్ల పూలతో అందంగా ముస్తాబు చేశారు. భక్తులు ఉదయం నుంచే ఆలయానికి క్యూ కట్టి కేదారేశ్వరుడిని దర్శించుకుంటున్నారు. మరోవైపు యమునోత్రి ఆలయం కుండా ఉదయం 7 గంటలకే తెరుచుకుంది. గంగోత్రిఆలయం మాత్రం మధ్యాహ్నం 12:20 గంటలకు తెరుచుకోనుంది. ఇక చార్‌ధామ్ యాత్రలో భాగమైన బద్రీనాథ్ ఆలయాన్ని ఈ నెల 12న తెరవనున్నట్లు బద్రీనాథ్-కేదార్‌నాథ్ ఆలయ కమిటీ ఛైర్మెన్ అజేంద్ర అజయ్ తెలిపారు. తన భార్య గీతా ధామితో కలిసి కేదార్‌నాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పవిత్ర పుణ్యక్షేత్రాలను సందర్శించేందుకు వచ్చిన భక్తులకు సీఎం పుష్కర్ సింగ్ శుభాకాంక్షలు తెలిపారు. యాత్రికులు సురక్షితంగా, సంతృప్తికరంగా ప్రయాణం సాగించాలని ఆయన ఆకాంక్షించారు, గత సంవత్సరాల్లో మాదిరిగానే ఈ కార్యక్రమం ఆనందం, ఉత్సాహంతో పూర్తవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా, కేదార్‌నాథ్ ధామ్‌తో పాటు, యమునోత్రి ఆలయ పోర్టల్స్, యమునా నది పవిత్ర స్థలాన్ని కూడా భక్తుల కోసం తెరిచారు. గంగోత్రి ఆలయ తలుపులు మధ్యాహ్నం 12.20 గంటలకు తెరవనున్నారు అధికారులు. భూమిపై వైకుంఠంగా (విష్ణువు నివాసం) పరిగణించబడే బద్రీనాథ్ ధామ్ మే 12వ తేదీ ఉదయం 6 గంటలకు తెరుచుకోనుంది.

# అటవీ అధికారులు, పోడుదారుల మధ్య ఘర్షణ.. పరిస్థితి ఉద్రిక్తం



కుమ్రంభీం ఆసిఫాబాద్ : ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం తుంగెడ అటవీ ప్రాంతంలో పోడుదారులు, అటవీ శాఖ అధికారుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. అక్రమంగా పోడు వ్యవసాయం చేస్తున్నారనే సమాచారం మేరకు అటవీ అధికారులు తుండెడ గ్రామం చేరుకున్నారు. అటవీశాఖ భూముల్లో పోడు వ్యవసాయం కోసం చెట్లు నరుకుతున్న గ్రామస్తులను అధికారులు అడ్డుకున్నారు.దీంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పరస్పరం దాడులకు పాల్పడటంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. కాగా, అక్రమంగా అటవీ భూములను సాగు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఖమ్మంలో తెలుగు తమ్ముళ్ల ఓట్లు ఎవరికి..? ఆసక్తిగా మారిన రాజకీయం




ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఒకప్పుడు టీడీపీ బలంగా ఉండేది. కొద్ది నెలల క్రితం జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ పోటీ చేయలేదు. ఇప్పుడు ఎంపీ ఎన్నికల్లో కూడా ఆ పార్టీ తెలంగాణ నుంచి అభ్యర్థులను నిలబెట్టలేదు.అయితే ఖమ్మం జిల్లాలో టీడీపీని అభిమానించేవాళ్లు పెద్ద సంఖ్యలో ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో వాళ్లంతా కాంగ్రెస్‌కు ఓటేశారు. అయితే ఈసారి టీడీపీ మద్దతుదారుల ఓట్లు ఏ పార్టీకి అనేది రాజకీయ చర్చకు దారితీస్తోంది. పార్లమెంటు ఎన్నికల వేళ ఖమ్మం జిల్లాలో టీడీపీ మూడు వర్గాలుగా విడిపోయింది. మొన్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చాం కదా?ఈసారి కూడా కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘురామిరెడ్డికి ఓటు వేద్దామని ఓ వర్గం వాదిస్తోంది. కాస్ట్ ఈక్వేషన్స్‌లో భాగంగా బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావుకు మద్దతు ఇవ్వాలని మరో వర్గం పట్టు పడుతోంది. ఇక ఏపీలో బీజేపీతో పొత్తు ఉంది కాబట్టి ఆ పార్టీ అభ్యర్థి వినోద్ రావుకు ఓటు వేయాలని మరికొందరు సూచిస్తున్నారు. ఇలా ఖమ్మం టీడీపీ మూడు పాయలుగా చీలిపోయింది.ఈ ఎన్నికల్లో తమకు మద్దతు ఇవ్వాలంటూ మూడు పార్టీల అభ్యర్థులు టీడీపీ ఆఫీసు గడప తొక్కారు. అయితే చంద్రబాబు ఆదేశాల మేరకు బీజేపీ అభ్యర్థికి మద్దతు ఇస్తున్నట్లు ఒక వర్గం ప్రకటించడమే కాకుండా?కాషాయ పార్టీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం చేస్తున్నారు. ఇక తాజాగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో సమావేశం అయి..కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ఇస్తున్నట్లు మరో వర్గం ప్రకటించింది. కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చినందుకు టీడీపీ నేతలకు కృతజ్ఞతలు తెలిపారు పొంగులేటి.ఇలా ఖమ్మం గుమ్మంలో టీడీపీ మద్దతుదారులు?మూడు దారుల్లో పయనిస్తున్నారు. పార్టీ మూడు పాయలుగా చీలిపోయింది.

# మోదీ హయాంలో వ్యవస్థలు ధ్వంసం

**సిపిఐ నేత కూనంనేని ఘాటు విమర్శలు**

ఖమ్మం,మే10:దేశంలో ఆటవిక రాజ్యం కొనసాగుతున్నదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. మోదీ హయాంలో వ్యవస్థలు ధ్వంసమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్షాలపై ఐటీ, ఈడీలను ప్రయోగిస్తుందన్నారు. బీజేపీకి అనుకూలంగా ఉన్నవారిపై ఒక్క దాడైనా జరిగిందా అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో ఇప్పటివరకు మూడు వేల ఈడీ కేసులు నమోదయ్యాయని చెప్పారు. వాటిలో ఒక్కటి కూడా నిరూపితం కాలేదని చెప్పారు. రాజకీయ కక్షతో దాడులు చేస్తున్నారని ఆరోపించారు. ప్రధాన నేరస్తుడు పీఎం మోదీయేనని చెప్పారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రగతిశీల శక్తులు ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేలను లొంగదీసుకునేందుకు వందల కోట్లు ఖర్చు చేస్తున్నారని విమర్శించారు.

# ఎన్నికల తరవాత కాంగ్రెస్ ప్రభుత్వం ఔట్

**మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్‌లే కూల్చేస్తారు**

**అవినీతి వల్లే కవిత జైలుకు వెళ్లారు**

**ఎన్నికల ప్రచారంలో ధర్మపురి అర్వింద్ సంచలన వ్యాఖ్యలు**

నిజామాబాద్,మే10: పార్లమెంట్ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం కూలడం ఖాయమని నిజామాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ అన్నారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటి రెడ్డి వెంకటరెడ్డి తలచుకంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కువ రోజులు పట్టదని అర్వింద్ చెప్పారు. వారిద్దరే ఇందుకు సమర్థులని అన్నారు. దేశం మొత్తం మీద కాంగ్రెస్ రెండు రాష్ట్రాల్లో అధికారంలో ఉందని..అవి కుడా ఎక్కువ రోజులు ఉండవన్నారు. అబద్దాలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ తొందరగా కూలిపోవాలని మొక్కి వెళ్ళి ఓటెయాలని ప్రజలను కోరారు. వేల్పూర్‌లో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో ఎంపీ అరవింద్ పాల్గొన్నారు.. ఈ సంధర్భంగా అరవింద్. దేశంలో హిందు, ముస్లింలకి లొల్లి నడుస్తలేదని..ఇస్లాం, ఇస్లాం వ్యతిరేకులకి మధ్య లొల్లి నడుస్తుందన్నారు. కాంగ్రెస్ కి ఓటు వేయాలని ఉగ్రవాద సంస్థలు లెటర్స్ రాస్తున్నాయని అర్వింద్ ఆరోపించారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో తాము రెండంకెల స్థానాలు సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కవిత అక్రమాలు చేసి జైలుకు వెళ్లిందని, అలాంటి పరిస్థితి వస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని అన్నారు. తెలంగాణలో తమ పార్టీకి ఇంత సానుకూలమైన ఎన్నికలను గతంలో తాను ఎప్పుడూ చూడలేదన్నారు. ఎస్సీ,ఎస్టీ రిజర్వేషన్లపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని, వాటిపై కాంగ్రెస్ ప్రచారాన్ని ప్రజలు నమ్మడంలేదని అన్నారు. ఎన్నికల్లో భాజపాను, కేంద్ర ప్రభుత్వాన్ని తిట్టడం, నిందలు వేయడం భారాస, కాంగ్రెస్‌లకు సాధారణమైపోయిందని విమర్శించారు. కేంద్రంలో సుస్థిర పాలన, స్థిరమైన ప్రభుత్వం, సమర్థ నాయకత్వంతో దేశం, తెలంగాణ అభివృద్ధి చెందాలంటే రాష్ట్ర ప్రజలు కూడా ప్రధాని మోదీ నేతృత్వంలోని భాజపాను ఆశీర్వదించాలని కోరారు. కేందరం నిధులు ఇవ్వలేదని, ఏమిచ్చిందని అడగడం ఫ్యాషన్ అయిపోయిందని, అసెంబ్లీ ఎన్నికలప్పుడే తెలంగాణకు కేంద్రం ఏమి ఇచ్చిందో స్పష్టంగా వివరించామని అర్వింద్ అన్నారు. కేంద్రంతో సఖ్యతతో ఉ ంటా అని అన్న సీఎం రేవంత్ ఇప్పుడు ఓట్ల కోసం ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు.లోక్‌సభలో మా పార్టీ ఎక్కువ సీట్లలో గెలుస్తుందని తెలుసుకుని సీఎం రేవంత్‌రెడ్డి భాజపాపై అభాండాలు వేస్తున్నారని అన్నారు. బట్ట కాల్చి మీదవేసే ప్రయత్నం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలు, హామీలు అమలు చేయక పోవడంపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ సంతకంతో అప్పట్లో పత్రాలు ఇచ్చారు. ఓట్లు వేయించుకుని సీఎం రేవంత్‌రెడ్డి వాటిని మరచిపోయారు. ఆ అంశాలు కాకుండా వేరే అన్నింటి గురించి మాట్లాడుతున్నారు. గతంలో కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ప్రజలు తాను ఏం చెబితే అది వింటారని అనుకునేవారు.



# అందాల సికిందర్ క్లీవేజ్ షో

పాతికేళ్ల క్రితం బాలీవుడ్ లో మాన్ సినిమాతో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ షామా సికిందర్. నాలుగు పదుల వయసులో కూడా ఇంకా అదే అందం.. అదే కవ్వింపు. బుల్లితెర మరియు వెండి తెరపై సుదీర్ఘ కాలం పాటు సందడి చేసిన ఈ సికిందర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో సందడి చేస్తుంది. మధ్య కాలంలో యంగ్ హీరోయిన్స్ కి ఏమాత్రం తగ్గకుండా అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేస్తుంది. ఈ రేంజ్ లో అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేస్తున్న షామా సికిందర్ ని చూసి కుర్రకారు షాక్ అవుతున్నారు. ఇంతటి అందంకు ఎందుకు బాలీవుడ్ లో స్టార్ డం దక్కలేదు అంటూ కామెంట్స్ చేస్తున్నారు. తాజాగా మరోసారి క్లీవేజ్ షో తో కన్నుల విందు చేసింది. ఈ స్థాయి అందాల ఆరబోత కేవలం షామా సికిందర్ కే సాధ్యం అంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి మళ్లీ మళ్లీ అదే అందాల ఆరబోత చేస్తున్నా కూడా నెటిజన్స్ మాత్రం ప్రతి సారి ఈ అమ్మడి ఫోటోలను షేర్ చేస్తూనే ఉన్నారు. ఈ మధ్య కాలంలో వెబ్ సిరీస్ లకు ఆధరణ పెరిగింది. ఇంతటి అందంను వెబ్ సిరీస్ లో చూస్తే బాగుంటుంది అనే అభిప్రాయం ను కొందరు వ్యక్తం చేస్తున్నారు. వయసుకు తగ్గ పాత్రల్లో ఈ అమ్మడు వెబ్ సిరీస్ లో మరియు సినిమాల్లో మంచి పాత్రల్లో నటిస్తే చూడాలని చాలా మంది కోరుకుంటున్నారు. సీనియర్ హీరోయిన్స్ కు ఇప్పటికి కూడా జత కట్టే అందం ఈ అమ్మడి సొంతం. అయినా కూడా షామా సికిందర్ కి ఆశించిన స్థాయిలో ఆఫర్లు రావడం లేదా.. లేదంటే ఈమెనే సినిమాలకు నో చెబుతుందా అనేది తెలియడం లేదు అంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు.



## ప్రపంచకప్ స్క్వాడ్‌లో నోఛాన్స్.. కట్‌చేస్తే.. రిటైర్మెంట్ ప్రకటించిన స్టార్ ప్లేయర్.. ఎవరంటే?

2024: టీ20 ప్రపంచకప్‌నకు కౌంట్‌డౌన్ మొదలైంది. దాదాపు అన్ని జట్లు కూడా తమ జట్టులను ప్రకటించాయి. అయితే, ఓ జట్టు ప్రకటన తర్వాత, ఇప్పుడు తుఫాన్ బ్యాట్స్‌మెన్ రిటైర్మెంట్ వస్తున్నాయి. జూన్‌లో అమెరికా, వెస్టిండీస్ వేదికగా జరగనున్న టీ20 ప్రపంచకప్‌కు జట్టులో ఎంపిక కాకపోవడంతో నిరాశ చెందిన న్యూజిలాండ్‌కు చెందిన తుఫాన్ బ్యాట్స్‌మెన్ కొలిన్ మున్రో అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. మున్రో ఎఖఒ ఫ్రాంచైజీలు ఢిల్లీ క్యాపిటల్స్, కోల్‌కతా నైట్ రైడర్స్, ముంబై ఇండియన్స్‌లలో కూడా భాగంగా ఉన్నారు. ప్రపంచకప్ జట్టులోకి ఎంపిక కాకపోవడంపై మున్రో నిరాశ చెందాడు. ఆ తర్వాత ఓ పెద్ద అడుగు వేశాడు. అయితే, ప్రపంచకప్‌నకు తాను అందుబాటులో ఉన్నట్లు ప్రకటించాడు. పదవీ విరమణపై మున్రో మాట్లాడుతూ- న్యూజిలాండ్ జెర్సీ వేసుకున్నంత గర్వంగా నేనెప్పుడూ భావించలేదు. నేను అన్ని ఫార్మాట్లలో 123 సార్లు వేసుకోగలిగాను. నేను చాలా కాలం క్రితం చివరి మ్యాచ్ ఆడాను. కానీ, నా ఫ్రాంచైజీ ం20 ఫామ్ ఆధారంగా పునరాగమనం చేయాలనే ఆశను నేను ఎప్పుడూ వదులుకోలేదు. టీ20 ప్రపంచకప్‌నకు న్యూజిలాండ్ జట్టును ప్రకటించడంతో రిటైర్మెంట్‌కు ఇదే సరైన సమయం' అంటూ చెప్పుకొచ్చాడు. 37 ఏళ్ల మున్రో చాలా కాలం పాటు న్యూజిలాండ్ జట్టుకు దూరంగా ఉన్నాడు. అతను తన చివరి అంతర్జాతీయ మ్యాచ్‌ను 2020 సంవత్సరంలో భారత్‌తో సిరీస్‌లో 5వ ం20 మ్యాచ్ ఆడాడు. అతను 65 ం20లు, 57 ాఆఎలు, ఒక టెస్ట్ మ్యాచ్‌లో కివీ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. అందులో అతను 3 వేల పరుగులు, ఏడు వికెట్లు తీసుకున్నాడు. న్యూజిలాండ్ తరఫున అత్యధిక టీ20 పరుగులు చేసిన ఆరో బ్యాట్స్‌మెన్.




# రష్మిక.. ఇది మైండ్ బ్లోయింగ్ కాంబినేషన్


ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుష్ప మూవీతో నేషనల్ క్రష్ గా మారిపోయిన హీరోయిన్ రష్మిక మందన్న.. ప్రస్తుతం చేతి నిండా సినిమాలతో బిజీగా ఉంది. వరుస అవకాశాలు దక్కించుకుంటూ దూసుకుపోతోంది. చివరగా సందీప్ రెడ్డి వంగా తెరకెక్కించిన యానిమల్ సినిమాతో పాన్ ఇండియా లెవెల్ లో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ఈ మూవీలో గీతాంజలి పాత్రలో కనిపించి



విమర్శకుల నుంచి ప్రశంసలు కూడా దక్కించుకుంది. త్వరలోనే మోస్ట్ అవైటెడ్ మూవీ పుష్ప-2లో శ్రీవల్లిగా మరోసారి అలరించనుంది రష్మిక. ఈ సినిమాతో పాటు శేఖర్ కమ్ముల తీస్తున్న మల్టీస్టారర్ కుబేరా సినిమాలో నటిస్తోంది. రెయిన్ బో, గర్ల్ ఫ్రెండ్ వంటి లేడీ ఓరియెంటెడ్ చిత్రాలు కూడా చేస్తోంది. తాజాగా మరో బంపర్ ఆఫర్ అందుకుంది రష్మిక. బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ తో నటించే ఛాన్స్ కొట్టేసింది. ఈ విషయాన్ని ఆమెతో పాటు మేకర్స్ సోషల్ మీడియాలో ప్రకటించారు. సల్మాన్ ఖాన్ హీరోగా దక్షిణాది ప్రముఖ దర్శకుడు ఏఆర్ మురుగదాస్ సికిందర్ సినిమా తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. ఈ మూవీలోనే రష్మిక హీరోయిన్ గా ఎంపికైంది. "మా మూవీ యూనిట్ లోకి రష్మికను స్వాగతిస్తున్నాం. సికిందర్ లో సల్మాన్ ఖాన్ సరసన ఆమె యాక్ట్ చేస్తున్నారు" అని నడియాడ్ వాలా గ్రాండ్ సన్ ఎంటర్టైన్మెంట్ సంస్థ ట్వీట్ చేసింది. ఇక రష్మిక మందన్న కూడా ట్వీట్ చేసింది. "మీరు ఎన్నో రోజులుగా నా సినిమా అప్డేట్స్ కోసం ఆసక్తిగా వెయిట్ చేస్తున్నారు. మీకోసమే ఈ సర్ప్రైజ్. సికిందర్ సినిమాతో మీ ముందుకు వస్తున్నాను. ఇంత గొప్ప ప్రాజెక్టులో యాక్ట్ చేసే ఛాన్స్ రావడం ఎంతో ఆనందంగా, గౌరవంగా ఉంది" అని రష్మిక తన హ్యాపీనెస్ ను షేర్ చేసుకుంది. అయితే ఈ బ్యూటీకి సికిందర్ సినిమా.. 25వ చిత్రం కావడం విశేషం. ఈ సినిమాను వచ్చే రంజాన్ కు రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు. అయితే ఏటా రంజాన్ ఫెస్టివల్ కు సల్మాన్ సినిమాలకు సంబంధించిన ఏదో ఒక అప్డేట్ వస్తుంటుంది. ఇప్పుడు సికిందర్ మూవీ 2025 ఈద్ కు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి ప్రీతమ్ సింగ్ మ్యూజిక్ అందిస్తున్నారు. ఎమోషన్స్ తో కూడిన యాక్షన్ ఫిల్మ్ గా సికిందర్ ఉండనున్నట్లు తెలుస్తోంది. మరి ఈ మూవీ ఎలాంటి హిట్ అవుతుందో వేచి చూడాలి.

# పెద్ద చిక్కుల్లో నితీష్ తివారీ 'రామాయణం' రణబీర్ కపూర్

రణబీర్ కపూర్- సాయి పల్లవి ప్రధాన పాత్రల్లో 'రామాయణం' చిత్రం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. నితీష్ తివారీ ఈ చిత్రానికి దర్శకుడు. ప్రైమ్ ఫోకస్‌తో కలిసి రాకింగ్ స్టార్ యష్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారని ఇంతకుముందు కథనాలొచ్చాయి. అయితే తాజా సమాచారం మేరకు ఈ భారీ బడ్జెట్ చిత్రం ఇబ్బందుల్లో పడిందని జూమ్ మీడియా కథనం వెలువరించినట్టు ప్రఖ్యాత



టైమ్స్ నవ్ పోర్టల్ వెల్లడించింది. సందీప్ మాయవన్.. కామన్ మ్యాన్ ఎబ సూపర్ విలన్! అల్లు మంతెన మీడియా వెంచర్స్ ఎల్ఎల్‌పి పబ్లిక్ నోటీసును జారీ చేసింది. తమ 'ప్రాజెక్ట్ రామాయణం' ఆధారంగా స్క్రిప్ట్‌ని ఉపయోగించుకుంటూ ప్రైమ్ ఫోకస్ టెక్నాలజీస్ లిమిటెడ్ 'ప్రాజెక్ట్ రామాయణం' మేధో సంపత్తి హక్కులను పొందేందుకు చర్చలు ప్రారంభించిందని, అయితే చెల్లింపు నిబంధనలను ఇంకా నెరవేర్చలేదని సదరు కథనం పేర్కొంది. ప్రైమ్ ఫోకస్ టెక్నాలజీస్ లిమిటెడ్ 'ప్రాజెక్ట్ రామాయణం'లోని ఏదైనా కంటెంట్‌ని ఉపయోగించడం కాపీరైట్ ఉల్లంఘనగా పరిగణించబడుతుందని, దీనిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అల్లు మంతెన మీడియా వెంచర్స్ ప్రకటించినట్టు సదరు కథనం పేర్కొంది ఈ నోటీసులో ఇలా ఉంది. "ఈ అసైన్‌మెంట్ అగ్రిమెంట్ కింద అసైన్‌మెంట్ అమలులోకి రావడానికి ప్రైమ్ ఫోకస్ టెక్నాలజీస్ లిమిటెడ్ ద్వారా ఒప్పందం ప్రకారం చెల్లించాల్సిన చెల్లింపులు ఏవీ అందలేదు. దీనివల్ల ప్రాజెక్ట్ రామాయణంలో హక్కులు మాకు మాత్రమే చెందుతాయి. ప్రైమ్ ఫోకస్ టెక్నాలజీస్ లిమిటెడ్‌కు సినిమా తీసే హక్కు లేదు" అని పేర్కొన్నట్టు టైమ్స్ నవ్ కథనం వెల్లడించింది. మా స్క్రిప్ట్ లేదా మెటీరియల్ ఉపయోగం అంటే దోపిడీగా పరిగణించబడుతుంది. ప్రైమ్ ఫోకస్ టెక్నాలజీస్ లిమిటెడ్- నితీష్ తివారీ తెరకెక్కించే రామాయణం తో కలిసి పని చేసే వారంతా కాపీ రైట్ ఉల్లంఘన పరిధిలోకి వస్తారని అల్లు మంతెన కంపెనీ పేర్కొంది. ప్రతిష్ఠాత్మక చిత్రం 'రామాయణం'లో రణబీర్ కపూర్ శ్రీరాముడి పాత్రను పోషిస్తుండగా, సాయి పల్లవి సీత పాత్రను పోషిస్తోంది. ఐఉఈ యష్ రావణ్ పాత్రలో నటిస్తున్నారు. యష్ 150 కోట్ల రూపాయల భారీ ఫీజును వసూలు చేస్తున్నారని కథనాలొచ్చాయి. ఇటీవల ప్రైమ్ ఫోకస్ అనుబంధంగా తాను రామాయణం చిత్రానికి పెట్టుబడులు పెడుతున్నట్టుగా యష్ ప్రకటించారు.

# గాలా ఈవెంట్ లో జివ్వుమనిపించిన జెన్నీ!


హాలీవుడ్ సంచలనం -నటి - గాయని జెన్నీఫర్ లోపేజ్ గురించి పరిచయం అవసరంలేదు. జెన్నీ తెలియని సంగీత ప్రియుడు ఉండడు. పాప్ మ్యూజిక్ ఆల్బమ్స్ తో ప్రపంచ వ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్న బ్యూటీ. నటిగానూ అంతే ఫేమస్ అయింది. ఇక జెన్నీ వయసు అయిదు పదులు దాటినా అందాల ప్రదర్శనలో మాత్రం మార్పులేం రాలేదు. నవ నాయికలా ఇప్పటికీ సోషల్ మీడియాలో అందాల ఆరబోతతో అగ్గి రాజేస్తూనే ఉంటుంది. సాధారణ అరబోత అయితే పర్వాలేదు. అమ్మడు ఎప్పుడు నెట్టింటికొచ్చిన అసాధరణమైన అందాల ఆరబోతతోనే సెగులు పుట్టిస్తుంది. టాప్ టూ బాటమ్ దెబ్బకి కుర్రాళ్లు అలా స్టన్ అవ్వాల్సిందే. ఇక అవార్డు వేడుకల్లో జెన్నీ హోయల గురించైతే ప్రత్యేకంగా పొగడాల్సిన పనిలేదు. అమ్మడు డిజైనర్ దుస్తుల్లో వేదికపై కనిపించిందంటే? మెరుపులు మామూలుగా ఉండవు. తాజాగా జెన్నీఫర్ లోపేజ్ మరోసారి మెట్ గాలా 2024 ఈవెంట్ లో తళుక్కున మెరిసింది. ంపూసలతో కూడిన ఫిగర్-హగ్గింగ్ షీర్ షియాపరెల్లి గౌను ధరించారు. ఇందులో జెన్నీ ఎంతో అందంగా హైలైట్ అయింది. ఆ గౌను జెన్నీ అందాన్ని మరింత రెట్టింపు చేసింది. డ్రెస్ మ్యాచింగ్ మెడలో నక్లెస్..చెవులకు పెట్టిన బుట్టలు అంతే అందంగా హైలైట్ అవుతున్నాయి. ఇక జెన్నీ హెయిర్ స్టైల్ గురించి చెప్పాల్సిన పనిలేదు. గోల్డ్ కలర్ షైనింగ్ హెయిర్ జెన్నీ స్కిన్ ని పోలి ఉంది. ఆమె మ్యాకప్ అలంకరణ ప్రతీది ఎంతో అందంగా తీర్చిదిద్దాయి. అందానికి వయసుతో సంబంధం లేదని జెన్నీ ఫర్ లోపేజ్ మరోసారి ప్రూవ్ చేసింది. 54 ఏళ్ల వయసులో కూడా 25 ఏళ్ల అమ్మాయిలా కనిపించొచ్చని చాటి చెప్పింది. ఈ ఫోటోని ఉద్దేశించి అమ్మడు ఓ క్యాప్షన్ కూడా ఇచ్చింది. ఈ లుక్ ఎలా ఉంది అంటూ? నెటి జనుల ముందుకిలా వచ్చింది. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ గా మారింది. గాలా ఈవెంట్ కి జెన్నీ అందం హైలైట్ అంటూ నెటి జనులు పోస్టులు పెడుతున్నారు.

## టీమిండియా హెడ్ కోచ్ పదవి నుంచి రాహుల్ ద్రవిడ్ ఔట్.. కొత్తగా వచ్చేది ఎవరంటే?

టీమిండియా కొత్త కోచ్ నియామకానికి త్వరలో ప్రకటన విడుదల చేయనున్నట్లు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కార్యదర్శి జయ్ షా ధ్రువీకరించారు. 2021 నవంబర్ నుంచి టీమ్‌ఇండియా ప్రధాన కోచ్‌గా ఉన్న రాహుల్ ద్రవిడ్ 2023 వన్డే వరల్డ్ కప్ ముగిసిన తర్వాత అతని కాంట్రాక్ట్‌ను పొడిగించిన సంగతి తెలిసిందే. కానీ, ద్రవిడ్‌కు మరోసారి పొడిగింపు ఇచ్చేలా కనిపించడం లేదు. బోర్డు త్వరలో కొత్త కోచ్ కోసం ప్రకటన విడుదల చేస్తుంది. భారత జట్టు ప్రధాన కోచ్‌గా ద్రవిడ్ ప్రస్తుత బీసీసీఐతో కుదుర్చుకున్న ఒప్పందం జూన్‌లో ముగుస్తుంది. అప్పుడు భారత జట్టు కూడా టీ20 ప్రపంచ కప్ ప్రచారంలో పాల్గొంటుంది. 2023 నవంబర్లో భారత జట్టు ప్రధాన కోచ్‌గా ద్రవిడ్ తన సహాయక సిబ్బందితో కలిసి రంగంలోకి దిగాడు. కానీ, కొత్త కాంట్రాక్ట్ 2024 జూన్ చివరి వరకు మాత్రమే చెల్లుబాటు అవుతుంది. కాగా, ద్రవిడ్ కోరుకుంటే ఈ పదవికి మరోసారి దరఖాస్తు చేసుకోవచ్చని, అయితే మునుపటిలా ఆటోమేటిక్ పొడిగింపు ఉండదని జయ్ షా ధృవీకరించారు. రాహుల్ పదవీకాలం జూన్ వరకు మాత్రమే ఉంది. కాబట్టి, అతను దరఖాస్తు చేయాలనుకుంటే, చేయవచ్చు" అని బీసీసీఐ కార్యదర్శి క్రిక్ బజ్‌కు తెలిపారు. అయితే, విదేశీ కోచ్‌ను నియమించే అంశాన్ని తోసిపుచ్చారు. 'కొత్త కోచ్ భారతీయుడా, విదేశీయుడా అనేది మేం నిర్ణయించలేం. అది సీఏసీదే, మాది గ్లోబల్ బాడీ' అని బీసీసీఐ అధికారి తెలిపారు. ఇతర అంతర్జాతీయ బోర్డుల మాదిరిగానే వివిధ ఫార్మాట్లకు వేర్వేరు కోచ్లను నియమించే అవకాశాలను షా తోసిపుచ్చారు. ఆ నిర్ణయాన్ని కూడా సీఏసీ తీసుకుంటుంది. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, రిషబ్ పంత్ వంటి ఆల్ ఫార్మాట్ ఆటగాళ్లు ఉన్నారు. పైగా, భారత్ లో ఇలాంటి పరిస్థితి వచ్చిన దాఖలాలు లేవన్నారు. భారత కెప్టెన్ రోహిత్ శర్మతో సహా క్రియాశీల అంతర్జాతీయ ఆటగాళ్ల నుంచి చాలా విమర్శలను ఎదుర్కొన్న ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధనపై షా మాట్లాడుతూ.. ఈ విషయాన్ని ఫ్రాంచైజీతో చర్చించి, నిబంధనను కొనసాగించాలా వద్దా అనేది నిర్ణయిస్తానని అమిత్ షా చెప్పారు. 'ఇంపాక్ట్ ప్లేయర్ ఓ టెస్టింగ్ ప్రక్రియ.

# చర్మం మరియు జుట్టుకు బొప్పాయి అందించే బ్యూటీ బెనిఫిట్స్!!

మీ చర్మం మరియు జుట్టు సంరక్షణకు సహజ చికిత్సలు ఉత్తమ మార్గం. సింథటిక్ కెమికల్ బేస్డ్ ప్రొడక్ట్స్ వాడే బదులు నేచురల్ ప్రొడక్ట్స్ వాడటం మంచిది. సహజ పదార్థాలు మీ చర్మం మరియు జుట్టును నిర్వహించడానికి సహాయపడతాయి. అందువలన, మీరు ఎటువంటి దుష్ప్రభావాలను అనుభవించలేరు. కానీ సింథటిక్ ఉత్పత్తులు అకాల వృద్ధాప్యం మరియు జుట్టు రాలడం వంటి అనేక దుష్ప్రభావాలను కలిగిస్తాయి. బొప్పాయి మీ జుట్టు మరియు చర్మాన్ని సంరక్షించగల ఒక పండు. మీ చర్మం మరియు జుట్టుకు పోషణ కోసం ఇక్కడ కొన్ని సాధారణ బొప్పాయి ఫేస్ మరియు హెయిర్ మాస్క్‌లు ఉన్నాయి. అవి ఏమిటో ఈ కథనంలో తెలుసుకోండి. ఈ మాస్క్‌లు చర్మం మరియు జుట్టును ఎక్స్‌ఫోలియేట్ చేయడానికి, మాయిశ్చరైజ్ చేయడానికి, ఉపశమనానికి మరియు బలోపేతం చేయడానికి సహాయపడతాయి. జుట్టు మరియు చర్మం కోసం ప్రయోజనాలు బొప్పాయిలో ఉండే పెపైన్ చర్మ సంరక్షణలో అద్భుతంగా సహాయపడుతుంది. దీన్ని హెయిర్ ప్యాక్ గా అప్లై చేస్తే, ఇది చనిపోయిన చర్మ కణాలను తొలగిస్తుంది, రంధ్రాలను అన్‌లాగ్ చేస్తుంది మరియు నిస్తేజంగా మరియు మొటిమలను నివారిస్తుంది. అదనంగా, బొప్పాయిలోని విటమిన్ సి చర్మాన్ని ఫ్రీ రాడికల్స్ దెబ్బతినకుండా కాపాడుతుంది, డార్క్ స్పాట్‌లను కాంతివంతం చేస్తుంది మరియు కొల్లాజెన్ మరియు ఎలాస్టిన్ ఉత్పత్తికి తోడ్పడుతుంది. బొప్పాయి యొక్క ప్రయోజనాలు జుట్టు సంరక్షణకు కూడా విస్తరించాయి. బొప్పాయి మృతకణాలను తొలగించడం ద్వారా మీ చర్మ రూపాన్ని మెరుగుపరుస్తుంది మరియు ఇందులోని అధిక బీటా కెరోటిన్ కంటెంట్ చర్మపు రంగును మెరుగుపరుస్తుంది. అదనంగా, ఇది చర్మానికి తేమను అందించి అందంగా మార్చుతుంది. బొప్పాయి మరియు మలయ్ ఫేస్ ప్యాక్ బొప్పాయిలో పెపైన్ అనే ఎంజైమ్ ఉంటుంది, ఇది చనిపోయిన చర్మ కణాలను ఎక్స్‌ఫోలియేట్ చేయడం ద్వారా ప్రకాశవంతమైన చర్మాన్ని ప్రోత్సహిస్తుంది. ఇందులోని విటమిన్ సి మరియు ఫోలేట్ కంటెంట్ చర్మాన్ని హైడ్రేట్ గా ఉంచడంలో సహాయపడుతుంది. పాలు నుండి తీసుకోబడిన మలైలో లాక్టిక్ యాసిడ్ ఉంటుంది. ఇది యవ్వనమైన, ప్రకాశవంతమైన చర్మాన్ని ఇస్తుంది మరియు చర్మంలో నీటిని నిలుపుకోవడం ద్వారా



పొడిబారకుండా చేస్తుంది. ఈ ఫేస్ మాస్క్ చేయడానికి, మీరు కొంచెం బొప్పాయి గుజ్జును కలపాలి మరియు దానికి ఒక టేబుల్ స్పూన్ మలాయ్ కలపాలి. ఈ మిశ్రమాన్ని బాగా మిక్స్ చేసి ముఖానికి అప్లై చేసి 15-20 నిమిషాల పాటు అలాగే ఉంచి గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. తిరుమలలో అశ్వ వాహనంపై కల్కి అలంకారంలో శ్రీ మలయప్ప బొప్పాయి మరియు తేనె ఫేస్ మాస్క్ బొప్పాయి ఒక అద్భుతమైన సహజ ఎక్స్‌ఫోలియంట్. ఇది చనిపోయిన చర్మ కణాలను కరిగించి, రంధ్రాలను అన్‌లాగ్ చేస్తుంది మరియు నిస్తేజాన్ని నివారిస్తుంది. తేనె చర్మానికి అద్భుతమైన పదార్థం. ఎందుకంటే ఇది సహజమైన మాయిశ్చరైజర్. అంటే చర్మంలో తేమను ఆకర్షిస్తుంది మరియు నిలుపుకుంటుంది. ఈ మాస్క్ చేయడానికి, పావు కప్పు పండిన బొప్పాయిని మెత్తగా చేసి, దానికి రెండు టేబుల్ స్పూన్ల తేనె కలపాలి. తర్వాత దీన్ని ముఖానికి రాసుకుంటే ఫలితం ఉంటుంది. బొప్పాయి మరియు పసుపు ముఖానికి మాస్క్ బొప్పాయి మరియు పసుపు ఫేస్ మాస్క్ మీ చర్మానికి అనేక ప్రయోజనాలను అందించగల సమర్ధవంతమైన సహజ నివారణ. పసుపు శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్. ఇది ఫ్రీ రాడికల్స్ తొలగిస్తుంది. దాంతో చర్మాన్ని రక్షిస్తుంది, పసుపు కలయికను ప్యాక్‌గా ఉపయోగించడం వల్ల చర్మాన్ని పునరుజ్జీవింపజేస్తుంది మరియు యవ్వనంగా మెరుస్తుంది. రెగ్యులర్ వాడకంతో, ఈ ముసుగు మీ చర్మం యొక్క మొత్తం రూపాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది గణేష నిమ్మజ్జనం సమయంలో ఎలాంటి తప్పులు చేయకూడదు? బొప్పాయి మరియు అలోవెరా హెయిర్ మాస్క్ బొప్పాయి జుట్టుకు మేలు చేస్తుంది, ఎందుకంటే ఇది తలలోని మొటిమలను తొలగించి ఆరోగ్యంగా ఉంచుతుంది. కలబంద జుట్టుకు చక్కని పదార్థం. ఎందుకంటే ఇది జుట్టును తేమగా, మృదువుగా మరియు బలోపేతం చేస్తుంది. ఈ ఫేస్ మాస్క్ చేయడానికి, పావు కప్పు పండిన బొప్పాయిని మెత్తగా చేసి, రెండు టేబుల్ స్పూన్ల అలోవెరా జెల్‌ను కలపండి. ఈ మిశ్రమాన్ని మీ జుట్టు మరియు తలకు పట్టించి 15-20 నిమిషాల తర్వాత కడిగేయండి. బొప్పాయి మరియు అరటి హెయిర్ మాస్క్ అరటిపండ్లలో పొటాషియం పుష్కలంగా ఉంటుంది, ఇది జుట్టును బలపరుస్తుంది.

# నర్సాపూర్ పట్టణంలో విస్తృతంగా కొనసాగిన ప్రచారం

-దేశంలో ఇందిరమ్మ రాజ్యం రావాలి

-కులాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించింది కాంగ్రెస్ పార్టీ-నీలం మధును గెలిపించి పార్లమెంటుకు పంపుదాం

-ఆంజనేయులు గౌడ్, ఆవుల రాజిరెడ్డి, మదన్ రెడ్డి





**నర్సాపూర్ (ప్రస్థానం న్యూస్):-** మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ కి మద్దతుగా శుక్రవారం నర్సాపూర్ పట్టణంలోని మజీద్ వద్ద ఎన్నికల ప్రచారాన్ని మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, నర్సాపూర్ నియోజకవర్గ ఇంచర్జ్ రాజి రెడ్డి, నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, విస్తృతంగా వహించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఇందిరమ్మ రాజ్యం రావాలి. కాంగ్రెస్ పార్టీ కులాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేసింది, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే 6 గ్యారంటీలు అమలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఎంపీపీ జ్యోతి సురేష్ నాయక్,వెల్దుర్తి ఎంపీ ఎంపీపీ నరేందర్ రెడ్డి,మాజీ జడ్పిటిసి శ్రీనివాస్ గుప్తా, నర్సాపూర్ పట్టణ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, నర్సాపూర్ బ్లాక్ అధ్యక్షులు రిజ్వన్,నర్సాపూర్ మండలం అధ్యక్షులు మల్లేష్ కొల్చారం మండలం అధ్యక్షులు మల్లేష్ గౌడ్, వెల్దుర్తి మండలం అధ్యక్షులు మహేశ్వర్ రెడ్డి,మజి ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్, రుస్తుంపెట్ ఎంపీటీసీఅశోక్,నర్సాపూర్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉదయ్ కుమార్, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ రషీద్, నర్సాపూర్ మండల మైనారిటీ సెల్ అధ్యక్షులు అజ్మత్,క్రిష్ణ గౌడ్, యుత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు



# బీజేపీలో చేరిన కాంగ్రెస్,బిఆర్ఎస్ పార్టీల నాయకులు





**నర్సాపూర్ (ప్రస్థానం న్యూస్):-** మెదక్ పార్లమెంట్ భారతీయ జనతా పార్టీ ఎంపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్ రావు సమక్షంలో వెల్మకన్నె గ్రామ మాజీ సర్పంచ్ తో పాటు కాంగ్రెస్,బిఆర్ఎస్ పార్టీల నాయకులు బిజెపిలో చేరారు. రఘువీరారెడ్డి, జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు రాజేందర్ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ మాణిక్యం ఆధ్వర్యంలో బిఆర్ఎస్ మాజీ సర్పంచ్ గంగాగౌడ్, కర్రోల,నర్సింలు, వనమాల నర్సింలు, కొన్యాల ప్రకాష్, కొన్యాల శేకులు, దేవుల పల్లి కిష్టయ్య, కర్రోల కాశి, చాకలి నాగరాజు, మంగలి నాగరాజుకు రఘునందన్ రావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ వెల్మకన్న రాజేందర్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రఘువీరా రెడ్డి ఓబిసి జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్య అశోక్, బిజెపి మండల అధ్యక్షుడు రాకేష్, వెల్మకన్న బూత్ అధ్యక్షుడు వనమాల రాజు, కిసాన్ మోర్చ మండల అధ్యక్షుడు బాల్ లింగం యాదవ్, చాకలి పంపు బిక్షపతి, లింగం పల్లి బూత్ అధ్యక్షుడు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఫైటర్ కి చీటర్స్ కు మధ్య పోటీ బిజెపికి ఫైటర్, కాంగ్రెస్ చీటర్, మధ్యలో పోటీ,



**రాజన్న సిరిసిల్ల జిల్లా న్యూస్ శ్రీ ప్రస్థానం. న్యూస్ ప్రతినిధి మే 10,** గంభీరావుపేట్,మండల శాఖ ఆధ్వర్యంలో. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా, కిసాన్ మోర్చ మండల, అధ్యక్షులు కోడె రమేష్ గారు, పత్రిక ప్రకటనలు, బిజెపి అంటే ఫైటర్, ప్రజల పక్షాన ప్రజల కొరకై, పని చేసే పార్టీ భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్ పార్టీ 60 సంవత్సరాల నుండి, భారతదేశాన్ని మోసం చేస్తూ, మాయమాటలతో మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ, మోసపూరిత కాంగ్రెస్ పార్టీ, చీటింగు చేసే పార్టీగా, పత్రిక ద్వారా, చెప్పడం జరిగింది,కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ముందు...రైతులకు డిసెంబర్ 9న. రెండు లక్షల,ఋణమాఫీని చేస్తామని, ఎకరాకు, రైతు బంధు 15వేల రూపాయలు, ఇస్తామని, 12 వేలరూపాయలు పెట్టుబడి సాయం, అందిస్తామని మాయ మాటలు, మార్చి 100 రోజులలో 6 గ్యారంటీలను అమలు, చేస్తామని చెప్పడం జరిగింది, చేతగాక గత ఃఖీా ప్రభుత్వం, వలె ఈ ప్రభుత్వానికి కూడా ఇచ్చిన హామీలను అమలు చేసే సత్తా లేదని, మాట్లాడడం జరిగింది,మళ్లీ ప్రచారంలో, మాయమాటల ద్వారా, నిరూపించు కునీటున్నారు, రాష్ట్ర ప్రజలను మోసం చేయడానికి పార్లమెంట్ మరియు రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో, ఓటమి భయంతో ఓట్లను దండుకోవాలని, ఆగస్టు 15 వరకు 2 లక్షల రుణమాఫీ చేస్తామని బూటకపు, మాయ మాటలతో మోసం చేయడానికి, మభ్యపెట్టడానికి,ఈ కాంగ్రెస్ ప్రభుత్వం, చూస్తుందన్నారు, కాంగ్రెస్ పార్టీకి ఓటు అడిగే నైతికహక్కులేదన్నారు.తెలంగాణ, ప్రజలు ,బూటకపు మాయ మాటలను భరించారు. ప్రజలు గత ఃఖీా ప్రభుత్వానికి,పట్టించిన గతిని, ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి, పట్టించడానికి,ప్రజలుఫిక్స్ అయ్యారు,కాబట్టి రానున్న ఎన్నికలలో, కాంగ్రెస్ పార్టీకి, ప్రజలు ఎన్నికలో ఓటు ద్వారా, బుద్ధి చెప్తారని,తమ ఓటు హక్కుతో బొంద పెట్టడానికి సిద్ధంగా,ఉన్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి, మాటకు మతి లేదు, అధికారానికి అతి గతి లేదు, అన్నట్టుగా ఈ పాలన కొనసాగుతుంది. కాబట్టి ఃఖీా కు ఓటు వేస్తే ఆ ఓటు వృధా అవుతుంది కనుక దేశంలో గెలిచేదిమోడీ గారే కాబట్టి ప్రజలందరూ కమలం గుర్తుపై మీ అమూల్యమైన,ఓటు వేసి కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ కుమార్, అన్న. అధిక మెజార్టీతో గెలిపించాలని, కోరడం జరిగింది, సమస్యలపై నిస్వార్థం గా. ప్రజల శ్రేయస్సు, ప్రజల కష్టసుఖాలు, తెలిసిన, నీకాసైనా అభ్యర్థి , ప్రజల సమస్యలపై, ప్రజల కొరకే కొట్లాడే.అభ్యర్థి. ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్న మానవతావాది, పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక, మెజారిటీతో గెలిపించాలని కోరారు

# ఉచితపథకాలపై సమగ్ర చర్చ జరగాలి

ఇసి పరిధిలోనే ఎన్నికల విధానాలు ఉండాలి

అక్రమార్కులపై కొరడా ఝుళిపించాలి

ఎన్నికల్లో ఓట్ల లెక్కింపు పటిష్టంగా జరగాలి

న్యూఢిల్లీ,మే10: రాజకీయ పార్టీల ఉచితహామీలపై గతంలోనే సుప్రీంలో చర్చ జరిగింది. ఇది ఇసి పరిధిలోనే ఉండాలి. ఉచిత హామీలను ఇవ్వకుండా చూడాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్ పరిధిలో ఉండాలి. ఒకవేళ ఉచిత పథకాలు ప్రకటిస్తే దానికి ఆర్థికంగా అమలుకు ఉండే అవకాశాలను ప్రతిపాదించాలి. అయితే ఇప్పుడు ఉచిత పథకాలే ప్రధాన ఆకర్శణగా మారాయి. ఒకరిని మించి ఒకరు పోటీపడి ఉచిత హామీలు ఇస్తున్నారు. కాంగ్రెస్ మహిళల ఖాతాల్లో లక్ష వేస్తామని అంటోంది. ఎపిలో జగన్ బటన్లు నొక్కాను కాబట్టి నాకే ఓటేయాలని అంటున్నారు. అంతకుమించి అన్నట్లు చంద్రబాబు పథకాలు ప్రకటించారు. ఇవన్నీ ఆర్థికంగా సాధ్యమా లేదా అన్నది ఆలోచించడం లేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో కూడా కాంగ్రెస్ ఇలాంటి హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చింది. కెసిఆర్ కూడా ఉచిత పథకాలతో ఖజానా గుల్ల చేశారు. ఎపిలో జగన్ అప్పులకుప్ప చేశారు. మొత్తంగా ఉచితపథకాలు రాష్ట్రాలను దివాళా తీయిస్తున్నా కంట్రోల్ చేసేదెవర్న ప్రశ్న వేధిస్తోంది. ఇటీవల రాజకీయ పార్టీలు ఈ దురదృష్టకరమైన ధోరణిని ప్రముఖంగా ప్రస్తావిస్తున్నాయి. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ఉచితాలు ఇస్తామంటూ చేసే హామీలు, వాగ్దానాలనేవి తమ పరిధిలోకి రావంటూ ఇ.సి సుప్రీం కోర్టులో గతంలో తన వైఖరి స్పష్టం చేసింది. ఈ విషయంలో జోక్యం చేసుకోవడానికి చేసే ఏ ప్రయత్నమైనా కూడా తమ అధికారాలను ఉల్లంఘించి వ్యవహరించడమే అవుతుందని పేర్కొంది. ఎన్నికల నిబంధనా వళిని సవరించాలని ఆలోచిస్తున్నామని, రాజకీయ పార్టీలు చేసే ఎన్నికల వాగ్దానాలు, వాటి ఆర్థిక పర్యవసానాల వివరాలను వెల్లడించే ప్రొఫార్మాను ప్రవేశ పెట్టాలను కుంటున్నామంటూ రాజకీయ పార్టీలకు ఎన్నికల సంఘం గతంలో తెలియచేసింది. పైగా, రాజకీయ పార్టీలు తాము ఇచ్చే హామీలను నెరవేర్చేందుకు అవసరమయ్యే అదనపు వనరులను ఎలా సమీకరిస్తారో కూడా తెలియ చేయాల్సి వుంటుందని పేర్కొంది. ఈ రీతిలో ప్రజలకు రాజకీయపార్టీలు ఇచ్చే హామీల విషయంలో జోక్యం చేసుకోవ మనేది... విజ్ఞతతో కూడి ఉండాలి. ఆర్థికసుస్థిరత అన్నది రాజకీయ పార్టీ విధానాన్ని నియంత్రించే ప్రయత్నమే. ఇటువంటి ఎన్నికల వాగ్దానాలను సమీక్షించాల్సిన పని ఇ.సి కి లేదు. కానీ, ఇటువంటి చర్య తీసుకోవడం ద్వారా, కొద్ది మాసాల క్రితం సుప్రీం కోర్టులో తాను తీసుకున్న వైఖరికి పూర్తి భిన్నంగా, ప్రధాని ఆదేశాలను నెరవేరుస్తున్నారన్న ఆరోపణలను మూటగట్టుకునే రీతిలో ఇ.సి వ్యవహరించింది. ప్రభుత్వం మొదటిసారిగా ప్రతిపాదించిన ఎన్నికల బాండ్ల పథకానికి వ్యతిరేకంగా ఇ.సి నిర్ద్వంద్వంగా తన వైఖరిని తెలియచేసింది. ఎలాంటి పారదర్శకత లేని ఈ వ్యవస్థ గురించి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ, ఇటువంటి అజ్ఞాత నిధులు, విరాళాలు స్వేచ్ఛగా, సక్రమంగా ఎన్నికల నిర్వహణను ఎలా దెబ్బతీస్తాయో తెలియచేసింది. ఇకపోతే ఎన్నికల్లోకి అజ్ఞాతంగా వచ్చిపడే నిధుల ప్రవాహాన్ని ఎలా అడ్డుకోవాలనేది తీవ్రంగా ఆలోచించాలి. రాజకీయ పార్టీలు అందుకునే విరాళాలను బహిర్గతం చేయాలి. రూ.20 వేలకు పై బడిన విరాళాలకు రాజకీయ పార్టీలు మూలం ప్రకటించాలని చట్టం పేర్కొంటోంది. అయితే, రూ.2 వేలకు పైబడిన విరాళాలు వచ్చినా వాటిని కూడా ప్రకటించేలా ఈ చట్టాన్ని సవరించాలని గతంలోనే న్యాయశాఖ మంత్రికి ఇ.సి లేఖ రాసింది. రూ.2 వేల కన్నా తక్కువ మొత్తంలో అజ్ఞాతంగా వచ్చిన విరాళాలపైనా ఆంక్షలు విధించాలని ఇ.సి భావిస్తోంది. పాలక పార్టీకి విధేయంగా వుండడానికి సదా సన్నద్ధంగా వుండే కార్పొరేట్లు, చీకటి వ్యాపారుల నుండి పెద్ద మొత్తంలో నిధులు సమీకరించడమన్నది ఆగిపోవాలి. అలాగే ఇవిఎంలపై ఉన్న అనుమానాలు తొలగి పోవాలి. ఇవిఎంలలో వేసిన ఓటు, వివిప్యాట్లకు సరిపోతుందా లేదా అన్నది తెలుసుకునే హక్కు ప్రజలకు ఉంది. ఓటేసిన వారికి ఆ హక్కు ఉంది. కానీ ఎన్నికల సంఘం కూడా దీనికి అంగీకరించే స్థితిలో లేదు. ఇకపోతే గతంలో ఎన్నడూ లేనంతగా ఎన్నికల సంఘం అభాసు పాలవు తోంది. ఇవిఎంలు మొరాయించడం మొదలు, ఓటింగ్ శాతంలలో తేడాలు రావడ, వేసిన ఓట్లకన్నా కౌంటింగ్‌లో ఎక్కువ లెక్కకు రావడం వంటి అంశాలు ఇసి నిజాయితీని శంకించేలా చేస్తున్నాయి. వీవీప్యాట్ల లెక్కింపుపై ఇంతవరకు మార్గదర్శకాలు జారీ చేయలేదు. నిజానికి దేశంలోని చట్టసభలకు ఎన్నికలనుస్వేచ్ఛగా,న్యాయంగానిర్వహించేందుకు రాజ్యాంగం ద్వారా అధికారం పొందిన ఎన్నికల సంఘం నిష్పక్ష పాతంగా వ్యవహరించాలి. కొన్ని లోపాలు, లొసుగులు వున్నప్పటికీ ఎన్నికలను స్వేచ్ఛగా, న్యాయంగా నిర్వహించటంలో ఎన్నికల కమిషన్ విశ్వసనీయతను నిరూపించుకోవాలి. ఎన్నికల్లో ధన బలం వినియో గాన్ని నివారించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి సక్రమంగా అమల య్యేలా చూడాల్సిన కమిషన్ తన కర్తవ్య నిర్వహణలో విఫలం కావడం క్షంతవ్యం కాదు. ఇకపోతే గత అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో పోలైన ఓట్లకు లెక్కించిన ఓట్లకు మధ్య తేడా వచ్చింది. అలాగే దాదాపు 25 లక్షల వరకు ఓట్లు గల్లంతు అయినట్లుగా ఆరోపణలు వచ్చాయి. మొత్తంగా ఇలాంటి అక్రమాలు అవకతవకలు బయట పడుతున్నాయి. ఎన్నికల కమిషన్‌ను పూర్తి స్థాయిలో సంస్కరించి దాని సమగ్రతను కాపాడేందుకు, కేంద్ర ప్రభుత్వం, అధికార పార్టీ ప్రభావం పడకుండా రక్షించుకునేందుకు చర్యలు తీసుకోవడం అవసరం. ఓటరు కార్డు ఉన్నా ఓట్లు గల్లంతు అవుతున్న పట్టింపు లేకుండా పోయింది. ఇలా ఉత్పన్నమైన సమస్యలకు అనుమానా లకు ఇసి వద్ద సమాధానం లేదు.

# ఇసీ ఉత్తర్వులపై ఒకరోజు స్టే

13 తరవాతే పథకాలకు నిధుల విడుదల

హైకోర్టు ఆదేశాల మేరకు అధికారుల ఏర్పాట్లు

అమరావతి,మే10 : రైతులకు పెట్టుబడి రాయితీ (ఇన్‌పుట్ సబ్సిడీ), విద్యా దీవెన, చేయూత, ఆసరా, ఈబీసీ నేస్తం పథకాల నిధులను ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు లబ్దిదారులకు జమచేయవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. అంటే 13న ఎన్నికలు పూర్తయిన తరవాతనే పంపిణీ చేపట్టాలని సూచించింది. మరోవైపు ఈ నెల 13న ఓటింగ్ ముగిసేవరకు ఈ పథకాలకు సంబంధించిన నిధులను జమచేయవద్దంటూ ఈసీ ఈనెల 9న ఇచ్చిన ఉత్తర్వులను 10 వరకు తాత్కాలికంగా పక్కనపెట్టింది. నిధుల పంపిణీకి ఏవిధంగాను ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం చేయవద్దని స్పష్టం చేసింది. ఎన్నికల సంఘం జారీ చేసిన ప్రవర్తన నియమావళిని అతిక్రమించేలా వేడుకలు నిర్వహించవద్దని.. నేతల జోక్యం లేకుండా చూడాలని తేల్చిచెప్పింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ గురువారం రాత్రి ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులిచ్చారు. ప్రధాన వ్యాజ్యాలపై కౌంటర్ వేయాలని ప్రతివాదులను ఆదేశించారు. ఈ నెల 13న పోలింగ్ తేదీ ముగిసే వరకు పెట్టుబడి రాయితీ, విద్యా దీవెన, చేయూత, ఆసరా, ఈబీసీ నేస్తం పథకాల సొమ్ము రూ.14,165 కోట్లను లబ్దిదారుల ఖాతాల్లో జమచేయకుండా నిలువరిస్తూ 9న ఈసీ తీసుకున్న నిర్ణయాన్ని, అంతకు ముందు ఈసీ జారీచేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ హైకోర్టులో పలువురు వ్యాజ్యాలు దాఖలు చేశారు. వీటిపై గురువారం హైకోర్టులో సుదీర్ఘ విచారణ జరిగింది. ఈసీ తరఫున సీనియర్ న్యాయవాది అవినాష్ దేశాయ్ వాదనలు వినిపించారు. పోలింగ్ ఈ నెల 13తో ముగుస్తుందని, ఆ తర్వాత రోజు రైతులకు పెట్టుబడి రాయితీ, విద్యా దీవెన, చేయూత, ఆసరా, ఈబీసీ నేస్తం పథకాల నిధులను జమచేస్తే అభ్యంతరం లేదన్నారు. ఎన్నికల ప్రక్రియ (జూన్ 6) ముగిసే వరకు నిధులను జమచేయవద్దని గతంలో నిర్ణయం తీసుకున్నామని, రాష్ట్ర ప్రభుత్వం తాజాగా సమర్పించిన వివరాలను పరిశీలించాక పోలింగ్ ముగిసిన మరుసటి రోజు జమచేయవచ్చని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల సమాన అవకాశాలు దెబ్బతీయకుండా, లబ్దిదారులను దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. సొమ్మును జమచేసే విషయంలో రెండుమూడు రోజులు వేచిచూస్తే వచ్చే నష్టమేమీ లేదన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు జూన్ 6 వరకు ఉన్నప్పటికీ.. ఓటింగ్ అయిన మరుసటి రోజే సొమ్ము జమకు అనుమతి ఇచ్చామన్నారు. వివిధ పథకాల కింద లబ్దిదారులకు రూ. 14,165 కోట్ల పంపిణీకి రాష్ట్రప్రభుత్వం అనుమతి కోరిందన్నారు. ఎన్నికలకు ముందు అంత పెద్దమొత్తంలో సొమ్మును జమచేస్తే ఎన్నికల ప్రక్రియపై ప్రభావం పడుతుందన్నారు.

# చింతల మాణిక్ రెడ్డి ఆధ్వర్యంలో మోడీ సభకు...





మల్కాజ్గిరి జిల్లా శ్రీ ప్రస్థానం స్టాఫ్ రిపోర్టర్ : మల్కాజ్గిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటెల రాజేందర్ అల్వాల్ జిహెచ్ఎంసి పరిధిలోని 133 డివిజన్ మచ్చ బొల్లారం బిజెపి నాయకులు మరియు 134 డివిజన్ అల్వాల్ నాయకులు. నరేంద్ర మోడీ సభకు భారీ ఎత్తున కార్యకర్తలతో చింతల మాణిక్ రెడ్డి మేడ్చల్ జిల్లా కార్యదర్శి. ఆధ్వర్యంలో నరేంద్ర మోడీ సభకు133 డివిజన్ విజయ్ రెడ్డి. ఇన్చార్జిలు వినయ్ సుధాకర్ 134 డివిజన్ అధ్యక్షులు కార్తీక్ గౌడ్ .కృష్ణారెడ్డి .మల్లికార్జున్ శేఖర్.135 డివిజన్ అధ్యక్షుడు రవి కిరణ్. పీవీ సింగ్. నరేంద్రబాబు. తదితరులు పాల్గొన్నారు.

# మాదిగ మరియు ఉపకులాలు ఓట్లు ఎటువైపు ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు సాయిలు మాదిగ

**శ్రీ ప్రస్థానం న్యూస్ పటాన్చెరు** ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు ఎలక్షన్ల సందర్భంగా మాదిగ ప్రజలు ఎటువైపు ఉండాలో తెలుసుకోవాలని జిల్లా నాయకులు సాయిలు మాదిగ అన్నారు ఎందుకంటే గత 30 సంవత్సరాలుగా కాంగ్రెస్ నమ్మి మోసపోయాము మరియు టిఆర్ఎస్ పార్టీని నమ్మి మోసపోయాము కావున ఈసారి బిజెపికి మద్దతుగా నిలిచి జాతి భవిష్యత్తు కోరుకుందాం ఎందుకంటే ఎ బి సి డి వర్గీకరణ అయితే అన్ని రంగాల్లో మాదిగ జాతి అభివృద్ధి చెందుతుంది మరియు మాదిగ ఉపకులాలు కూడా అభివృద్ధి చెందుతాయి ఉద్యోగ విద్య రాజకీయ మరియు ఇతర రంగాలలో అభివృద్ధి చెందుతారని అన్నారు ఎస్సీ రిజర్వ్ పార్లమెంట్ స్థానాలలో ఏ ఒక్క మాదిగ బిడ్డకు సీటు ఇవ్వకుండా అన్యాయం చేసింది ఉచిత హామీల పేరుతో ప్రజల్ని మోసం చేస్తూ ఓటు బ్యాంకుగా చూస్తున్నారా తప్ప హామీలు నెరవేర్చడంలో విఫలమైతున్నారు కావున ఈ కాంగ్రెస్ టిఆర్ఎస్



పార్టీలకు మన ఓటుతో బుద్ధి చెప్పాలని ఆయన చెప్పారు మెదక్ పార్లమెంటు నుంచి శ్రీ రఘునందన్ రావు గారికి ఓటు వేసి ఆయనను గెలిపించుకోవాలని ఆయన ఎంపీగా గెలిపించాలని కోరారు

# వినోద్ కుమార్ గెలువాలని ఎన్నారైలంతా కోరుకుంటున్నారు




కరీంనగర్ : కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్‌ను భారీ మోజార్టీతో గెలిపించి పార్లమెంట్‌కుపంపాలని ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ ఎన్నారైలు కోరుకుంటున్నారని ఎన్నారై బీఆర్ఎస్ వ్యక్వస్థాపక అధ్యక్షుడు అనిల్ కూర్మాచలం తెలిపారు. వినోద్ కుమార్‌కు మద్దతుగా కరీంనగర్‌లో ఎన్నారై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మీడియా సమావేశంలో మాట్లాడారు.కరీంనగర్ గడ్డ కేసీఆర్ అడ్డా అని, తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రతి కీలక సందర్భంలో కేసీఆర్‌కు అండగా కరీంనగర్ నిలిచిందన్నారు. ఉద్యమకారుడిగా, మేధావిగా గతంలో ఎంపీగా వినోద్‌కుమార్ కరీంనగర్‌కు ఎంతో సేవ చేశారు. వివిధ రంగాల్లో కరీంనగర్ అభివృద్ధికి వినోద్ కృషి చేశారని, ఇలాంటి నాయకుడు పార్లమెంట్‌కు వెళ్తే యావత్ తెలంగాణ రాష్ట్రానికే మేలు జరుగుతుందన్నారు. బండి సంజయ్ గత ఐదు సంవత్సరాలుగా కరీంనగర్‌కు పైసా పని చెయ్యలేదని వారికి ఓటు అడిగే నైతిక హక్కు లేదన్నారు.కాంగ్రెస్ పార్టీ కరీంనగర్‌లో ఎక్కడా పోటీలో లేదని, దాన్ని ప్రజలు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ప్రజలు భారీ మెజారిటీతో వినోద్ కుమార్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.సమావేశంలో కరీంనగర్ టౌన్ ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ రెడ్డి, ఎన్నారై బీఆర్ఎస్ నాయకులు రాజ్ కుమార్ శానబోయి, ప్రశాంత్ మామిడాల, వివేక్, ప్రవీణ్ పంతులు తదితరులు పాల్గొన్నవారిలో ఉన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PERUMALLA CHENNAKESHAVULU PRINTED AT UTTEJETHA PRINTERS,H. NO: 46/801BHUDHAWARPETA, KURNOOL DIST,-518001, ANDHRA PRADESH, INDIA . PUBLISHED AT. H.NO 43/217A, NR PETA, KURNOOL DIST, ANDHRA PRADESH, INDIA. EDITOR PERUMALLA CHENNAKESHAVULU RNI NO: APTEL 2020/80757